

"ఇది మన పుడమి, నీది, నాది, మనందరిది. ధనికులు, పేదలు, చదువుకున్నవారు, చదువుకోని వారు, జాతులు, కులాలు, మతాలనే తేడాలు లేకుండా మనమంతా కలసి మెలసి జీవించాలి. పుడమి తల్లి కోరిక, ఆకాంక్ష ఇదే! అప్పుడప్పుడు లేదా సందర్భాన్ని బట్టి కాకుండా ఈ పుడమిని ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపాడుకోవాలి.

పర్యావరణ వ్యవస్థలను కాపాడుతూ జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలి. పుడమి పచ్చదనంతో కళకళలాడాలి. అప్పుడు మాత్రమే మనం భావితరాలకు కాలుష్య రహిత, ఆరోగ్యప్రద హరిత ప్రపంచాన్ని అందించగలుగుతాం."

-కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ , పర్యావరణ సంస్థ




తెలంగాణ తొలి విత్తన పండుగ సందర్భంగా విడుదల


ఎర్త్ సెంటర్, అన్నాస్ పల్లి, కడ్తాల్ (మం), రంగారెడ్డి జిల్లా
ఇది కేవలం ఒక శిక్షణాలయం, గ్రంథాలయం,
పరిశోధనాలయం మాత్రమే కాదు పర్యావరణ పరిరక్షణ వేదిక కూడా

# ఆరోగ్యానికి, ఆహార భద్రతకు విత్తనం

డాక్టర్ దొంతి నరసింహ రెడ్డి, వ్యవసాయ విధాన విశ్లేషకులు



కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (CGR), పర్యావరణ సంస్థ



**డాక్టర్ దొంతి నరసింహ రెడ్డి**

**(వ్యవసాయ విధాన విశ్లేషకులు)**

వ్యాసకర్త విద్యార్థిదశ నుండే పారిశ్రామిక కాలుష్యంపై పరిశోధనలు నిర్వహిస్తూ, 1990లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యావరణ స్థితిగతులపై ఒక సమగ్ర నివేదికను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం మరియు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులు అయ్యారు. అణుశక్తి రంగంలో PhD పూర్తి చేసి శాస్త్రీయ పరిశోధనలో విస్తృత అనుభవాన్ని గడించారు. విశ్వవిద్యాలయాలు, కాలేజీలకోసం పర్యావరణవిద్యకు సంబంధించి ఎడ్యుకేషనల్ మెటీరియల్ రూపకల్పనతో పాటు, 2001లో ప్రచురితమైన "Environmental Education" అనే పుస్తకానికి సహ రచయితగా వ్యవహరించారు.

ఇప్పటివరకు పర్యావరణవిద్య, వ్యవసాయం, విద్యుత్, శక్తి, చేతివృత్తులు (హ్యాండ్లూమ్) మరియు ఆర్థిక-పర్యావరణ సమస్యలకు సంబంధించి అనేక పరిశోధన ప్రాజెక్టులలో పనిచేశారు. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ సమస్యలపై పరిశోధనలు చేస్తూ, భారతదేశంలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం కోసం సంబంధించిన విధాన రచనలో పాల్గొన్నారు. భారతీయ వ్యవసాయ పరిస్థితులకు అనుకూలమైన సేంద్రీయ వ్యవసాయ ప్రమాణాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన కృషికి గుర్తింపుగా, అంతర్జాతీయ సేంద్రీయ వ్యవసాయ ఉద్యమాల సమాఖ్యలో భాగమైన IFOAM (International Federation of Organic Agriculture Movements)-Asia కు బోర్డు సభ్యుడిగా ఎన్నికయ్యారు.

విత్తన పరిశ్రమ, పత్తి, చెరుకు, పుట్టగొడుగులు (సెరికల్చర్) తదితర రంగాలపై విశేష సమాచారాన్ని సేకరించడం గాక విధాన నైపుణ్యాన్ని కూడా సంపాదించారు. భూమి, నీటి సమస్యలపై జరిగిన ఉద్యమాలకు మద్దతుగా నిలిచారు. అమెరికాలో ఉన్న టెక్స్టైల్ ఎక్స్చేంజ్ సంస్థ (లాభాపేక్ష లేని ప్రపంచ సంస్థ) కు సలహా మండలి సభ్యునిగా పని చేశారు. భారతీయ టెక్స్టైల్ రంగాన్ని సమగ్రంగా విశ్లేషించే ఏకైక పరిశోధకునిగా, టెక్స్టైల్ రంగంలోని వివిధ విభాగాలను అనుసంధానించడానికి తన వంతు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ రాష్ట్ర సలహా కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. అంతేకాకుండా, FAO (ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్), వాటర్ ఎయిడ్ ఇండియా, IIPA (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) వంటి సంస్థలకు సైతం సలహాదారునిగా సేవలందిస్తున్నారు.

ఒక దశాబ్దం క్రితం, భారతదేశంలో హ్యాండ్లూమ్ రంగానికి సంబంధించిన కేంద్రాన్ని స్థాపించి, సమాచార వనరులు అందించడంతో పాటు విధానపరమైన అడ్వకసీని కూడా చేపట్టారు. హ్యాండ్లూమ్ రంగానికి సంబంధించిన జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై తెలుగులో 24 పుస్తకాలను వెలువరించారు. చేనేత మహిళల సమస్యలు, వేతనాలు, అన్యాయ పోటీ, హ్యాండ్లూమ్ మార్కెట్, బడ్జెట్లు, షెడ్ వీవర్స్ సమస్యలు మొదలైన అంశాలపై అనేక వ్యాసాలు రచించారు.

గత దశాబ్దంలో, భారతదేశంలో హ్యాండ్లూమ్ రంగానికి కొత్త మార్కెటింగ్ నమూనాను ప్రవేశపెట్టారు, దీని ద్వారా సుమారు 500 మంది చేనేత వస్త్రకారులని ఒకే వేదిక పైకి తీసుకువచ్చారు. హ్యాండ్లూమ్ ఉత్పత్తుల కోసం HS క్లాసిఫికేషన్ ను పునరుద్ధరించేందుకు ఒత్తిడి తీసుకొచ్చి విజయవంతం చేశారు. హ్యాండ్లూమ్ వీవింగ్ కమ్యూనిటీని జాతీయ విపత్తు ప్రణాళికలో భాగం చేస్తూ, 2007లో తుఫానుతో ప్రభావితమైన తీర ప్రాంత చేనేతకారులకి పరిహారం అందించడంలో సహాయపడ్డారు. అధికారికంగా 'ఆగస్టు 7' ని నేషనల్ హ్యాండ్లూమ్ డే గా గుర్తించేందుకు కృషి చేశారు.

విద్యుత్, టెక్స్టైల్, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు సంబంధించి విస్తృతమైన పరిజ్ఞానాన్ని సంపాదించుకున్నారు. గత 30 సంవత్సరాలుగా, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల పౌర సమాజంలో కీలక వ్యక్తిగా నిలిచారు. గత 17 సంవత్సరాలుగా, ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కు చెందిన పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ద్వారా విద్యుత్తురంగంపై పరిశోధన చేస్తూ, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విధాన మార్పుల కోసం పనిచేస్తున్నారు.

అణుశక్తి విధానంపై చేసిన తన పీహెచ్‌డీ పరిశోధన ఆధారంగా, వాతావరణ మార్పుల ప్రస్తుత సందర్భంలో, హ్యాండ్లూమ్ ఉత్పత్తిని ఉత్తమమైన టెక్స్టైల్ ఉత్పత్తి విధానంగా గుర్తించారు. హైదరాబాద్ పట్టణ నీటి సమస్యల పైన విస్తృతంగా పరిశోధనలు నిర్వహించారు.

వ్యవసాయం, వాణిజ్యం, విద్యుత్తురంగాలు మొదలైన వివిధ రంగాలపై అంతర్జాతీయ సెమినార్లు, వర్క్‌షాప్‌లలో పాల్గొన్నారు. కెనడా, స్వీడన్, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, పాకిస్తాన్, నేపాల్, ఫిలిప్పీన్స్, మలేషియా, బంగ్లాదేశ్, చైనా వంటి అనేక దేశాలను సందర్శించారు.

# కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (CGR), పర్యావరణ సంస్థ గురించి...

కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సిజిఆర్) పర్యావరణ సంస్థను 22 ఏప్రిల్ 2010 ధరిత్రీ దినోత్సవం నాడు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని అన్మాస్ పల్లి గ్రామంలో ప్రముఖ పర్యావరణవేత్తలు, సామాజిక బాధ్యత కలిగిన విద్యావేత్తల సమక్షంలో సంస్థ వ్యవస్థాపకులు శ్రీ కే. లక్ష్మారెడ్డిగారు ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్తలు, పాత్రికేయులు, ప్రకృతి ప్రేమికుల సలహా సహకారాలతో పర్యావరణ పరిరక్షణకు, సుస్థిరాభివృద్ధి కొరకు విస్తృతంగా కృషి చేస్తూ ఈ సంస్థ 15వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. అవగాహన, చైతన్యం, నాయకత్వం, భాగస్వామ్యం కొరకు లక్ష్యాత్మక, ఆచరణీయ కార్యాచరణ విధానాల ద్వారా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. వాటిలో కొన్నిటి గురించి తెలుసుకుందాం.

### వన ప్రేరణ

ఈ కార్యక్రమం తొలుత కొన్ని మొక్కలు నాటే కార్యక్రమంతో ప్రారంభమయిన ఈ హరితప్రస్థానం 3,893 ప్రభుత్వ పాఠశాలల సహకారంతో, 11,04,338 మంది పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యంతో, వివిధ ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థల ప్రత్యక్ష, పరోక్ష సహకారంతో నేటి వరకు 34,62,157 మొక్కలను తెలుగు రాష్ట్రాలలో నాటించడం జరిగింది. ఈ క్రమంలో లక్షలాది చిన్నారుల మెదళ్లలో పర్యావరణ చైతన్య బీజాలు నాటడం జరిగింది.

చిన్నారులను ప్రకృతితో మమేకం చేయాలనే ఉద్దేశ్యంతో విత్తన బంతుల తయారీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి ఇప్పటి వరకు 14 లక్షలకు పైగా విత్తన బంతులను తయారు చేసి వివిధ అటవీ, గ్రామసీమలలో వెదజల్లడం జరిగింది. మొక్కలకు జన్మదిన వేడుకలు, వృక్షాబంధన్, గ్రీన్ రికార్డ్ బుక్ వంటి ప్రత్యేక అంశాలతో హరిత ఉద్యమాన్ని కొనసాగిస్తున్నది. వీటిలో వృక్షాబంధన్ బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

### యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమం (YELP)

పర్యావరణ అంశాలపట్ల అవగాహన, ప్రకృతి పరిరక్షణపట్ల సానుకూల దృక్పథం, సుస్థిరతపట్ల చొరవ తీసుకోవడం, బాల్యదశలోనే పర్యావరణ పరిరక్షణకు చిన్నారులలో బీజం నాటడం కోసం పాఠశాల విద్యాశాఖ సహకారంతో 2022 సంవత్సరం నుండి "బాలల పుడమి నాయకత్వ కార్యక్రమం (Young Earth Leaders Programme)" ను తెలంగాణ రాష్ట్రంలోని 13 జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలలో అమలు చేస్తున్నది.

### పుడమి ద్వైమాస పర్యావరణ విజ్ఞాన పత్రిక

భూమి, ప్రకృతి పట్ల గౌరవ భావాన్ని, విజ్ఞాన విషయక, సామాజిక విలువలను, ప్రపంచ భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పాఠశాల విద్యార్థులలో పెంపొందించే లక్ష్యంతో సిజిఆర్ సంస్థ ఈ పత్రికను ప్రచురించి YELP అమలవుతున్న పాఠశాలలకు అందిస్తున్నది. ఈ పత్రికలో ఆకర్షణీయ బొమ్మలతో పర్యావరణ సంబంధిత వ్యాసాలు, కథలు, కవితలు, గేయాలు, పజిల్స్ (ప్రముఖులు, బాలలు రాసినవి) ఉంటాయి.

### పర్యావరణ దినోత్సవాలు

విస్తృత సామాజిక చైతన్యం కోసం సిజిఆర్ ప్రతి ఏటా వివిధ పర్యావరణ దినోత్సవాలు (ప్రపంచ పర్యావరణ దినోత్సవం, ధరిత్రీ దినోత్సవం, జల దినోత్సవం మొదలగునవి), సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు, వాతావరణ మార్పులపై COP సదస్సులు, సమావేశాలు, సెమినార్లు, నిర్వహిస్తూ వస్తున్నది.

### ఎర్త్ సెంటర్

శిక్షణార్థులకు ప్రకృతి శిబిరాలు, కార్యశాలలు, సెమినార్లు, శిక్షణలు, సదస్సులు, సమాలోచనల నిర్వహణకు ఎర్త్ సెంటర్ పేరుతో శ్రీశైలం జాతీయ రహదారిమార్గంలో, హైదరాబాద్‌కు సమీపంలో అన్మాస్‌పల్లి ప్రకృతి ఒడిలో ఒక పర్యావరణ ప్రాంగణాన్ని సిజిఆర్ అభివృద్ధి పరచింది.

### సిజిఆర్ ప్రచురణలు

సిజిఆర్ తన లక్ష్యసాధనకు కేవలం వివిధ కార్యక్రమాలు రూపొందించి అమలు చేయడమే కాకుండా పర్యావరణ సంబంధిత ప్రచురణలు(ఈస్టర్న్ ఘాట్స్ ఎన్విరాన్మెంట్ ఔట్ లుక్, అక్షర వృక్షాలు, పర్యావరణ ప్రాణపదం, జియోస్పిరిట్, ప్రాణులు-పర్యావరణం, అమేజింగ్ లైఫ్ ఇన్ విలేజెస్ అండ్ సస్టైనబులిటి, వేస్ అఫ్ ఇంటెగ్రిటీ ఇన్ ది వరల్డ్, అన్నదాత రైతన్నా!, కాన్ఫరెన్స్ ఆఫ్ పీపుల్ ప్రొసీడింగ్స్ 2021, '22, '23 & పుడమి ద్వైమాస పర్యావరణ విజ్ఞాన పత్రిక) కూడా చేపట్టింది.

# ఆరోగ్యానికి, ఆహార భద్రతకు విత్తనం

- డాక్టర్ దొంతి నరసింహ రెడ్డి, వ్యవసాయ విధాన విశ్లేషకులు

సూచిక


1. విత్తనాల ద్వారా వ్యవసాయ వికాసం 01
2. స్వాతంత్ర్యం కోల్పోతున్న విత్తనాలు 07
3. విత్తనంపై పెత్తనం 12
(రైతుకు పూర్తిగా మేలు చేయని జాతీయ విత్తనచట్టం ముసాయిదా -2019)
4. విత్తనాలకు ఒక సుస్థిర విధానం ఉండాలి... 23
5. Seed problem unsolved in India 28




# విత్తనాల ద్వారా వ్యవసాయ వికాసం

సమయానికి దొరకని విత్తుతో రైతు చిత్తు
అధిక ధరల విత్తుతో రైతు ఇంకా చిత్తు
సత్తు లేని విత్తుతో రైతు ఇంకా ఇంకా చిత్తు
స్పందించని అధికారులతో రైతు ఇంకా ఇంకా ఇంకా చిత్తు
హైకోర్టులో కంపెనీల కేసులతో రైతు పూర్తిగా చిత్తు

మొలకెత్తని విత్తుతో కంపెనీల లాభాలకు రెక్కలు
పాత స్టాకు విత్తుతో కంపెనీల పబ్బానికి రెక్కలు

రాయల్టీ విత్తులతో పెద్ద కంపెనీకి లాభాల పంట
'లైసెన్స్' విత్తులతో చిన్న కంపెనీకి మార్కెట్లో తంటా

పంటకు అధిక ధరలు, విత్తు కంపెనీల జూదం మొదలు
విత్తులకు కొత్త పేర్లు అట, కంపెనీలకది మూడుముక్కల ఆట

మేధోహక్కులతో విత్తు పునఃఉత్పత్తికి బంధనాలు
బక్క రైతుకు ఇస్తే హక్కు, ప్రభుత్వానికి వందనాలు

విత్తనాలే లేకుంటే వ్యవసాయం లేదు. ఆహార ఉత్పత్తిలో విత్తనం పాత్ర కీలకమైనది. పంట యాజమాన్యంలో ఎరువులు, విష రసాయనాలు, నీళ్ళు వంటి వాటి అవసరం విత్తనం నాణ్యత మీద ఆధారపడి ఉంటుంది. అధిక ఉత్పత్తి, ఉత్పాదకతలకు నాణ్యమైన విత్తనాలే మూలం. అయితే, గత ఇరవై ఏళ్ళలో రైతును ఆందోళన పరిచే అనేక అంశాలలో విత్తనాలు కూడా చేరిపోయినాయి. అమెరికాలో సగటు రైతు కూడా విత్తనాలు దొరకక, విత్తనకంపెనీల మాయజాలంలో ఇరుక్కుని నశించిపోతున్నాడు. ఇప్పటి పరిస్థితులలో, ఒక ప్రముఖ బహుళ జాతి కంపెనీ విత్తనాలు కొనకపోతే, ఎక్కడ కేసులు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందోనని భయపడుతున్నారు. ఆఫ్రికా ఖండంలో విత్తనాలు ప్రైవేటు రంగంలో ఉండడంతో, చిన్న సన్నకారు రైతులు వ్యవసాయం వదిలిపెట్టారు. విత్తనాలు పండించే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఈ పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది.

వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు ఒకప్పుడు రైతులు తమ పంట నుండి లేదా ఇతర రైతుల పంటల నుండి ఎంచుకొని దాచుకునేవారు, పరస్పరం పంచుకునేవారు. మంచి విత్తనాలను తామే ఎంచుకొని, మేలు రకాలను పునరుత్పత్తి చేసుకునేవారు.

దశాబ్దాల క్రితం, దిగుబడి పెంచాలని, అధిక దిగుబడి వంగడాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం రైతుల విత్తనపద్ధతులను మార్చి వేసింది. గత ముప్పై సంవత్సరాలలో క్రమంగా రైతులు విత్తనపరిజ్ఞానాన్ని, పద్ధతులని మరిచిపోయారు. గడచిన పదిహేను ఏళ్లలో ప్రభుత్వం క్రమంగా సంస్కరణల పేరిట, నాణ్యత పేరిట, విత్తన ఉత్పత్తిని ప్రైవేటు పరం చేసింది. ప్రస్తుతం, రైతులు విత్తన విక్రయదారుల చుట్టూ తిరుగుతూ ప్రైవేటు పరిశ్రమ మీద ఆధారపడి వాళ్లు సిఫారసు చేసే విత్తనాలు ఉపయోగించాల్సి వస్తున్నది.

కొన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల వాగ్దానంలో విత్తనాల మీద కొన్ని సాధారణ హామీలు ఇచ్చాయి. ఆ హామీలు ఏ రకమైన అవగాహనతో చేశారో తెలియదు కానీ, రైతుల ముందున్న విత్తనసమస్య పరిష్కరించాలంటే, కొన్ని మౌలిక మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలకు విత్తనపాలసీ అవసరం ఎంతైనా ఉంది. విత్తన ఉత్పత్తిలో రైతుల పాత్ర మార్చాలి. విత్తన రైతులు మొదటి నుంచి కూడా విత్తనకంపెనీల చేష్టలతో నలిగిపోతున్నారు. విత్తనాలు కొన్న రైతుల పరిస్థితి అంతే దయనీయంగా ఉంది. విత్తనకంపెనీలు కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నా రైతులకు ఒరిగింది శూన్యం. విత్తన ఉత్పత్తి రంగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విత్తన ధరలు పెరగడం వలన రైతుల ఉత్పత్తి ఖర్చులలో దాదాపు 6 నుంచి 33 శాతం విత్తనాల మీదనే ఖర్చు పెట్టవలసి వస్తున్నది. నాణ్యత లేని విత్తనాల వల్ల రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. పంటల మీద పెట్టుబడి అంతా పోయి అప్పుల పాలవుతున్నారు.

పత్తి విత్తనాల రంగంలో పూర్తిగా కొన్ని ప్రైవేటు కంపెనీలు విత్తన వ్యాపారాన్ని శాసిస్తున్నాయి. బీటీ పత్తి వలన రైతాంగానికి ఎటువంటి ఉపయోగం లేకపోగా, ప్రతి సంవత్సరం కోట్ల రూపాయలు రైతుల నుంచి కంపెనీలకు వెళ్లిపోతున్నాయి. 2013లో, తెలంగాణాలో అధికారిక లెక్కల ప్రకారం రైతులు దాదాపు రూ. 1,000 కోట్లు విత్తనకంపెనీలకు సమర్పించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంకొక రూ. 600 కోట్లు ఇచ్చుకున్నారు. అదే ఏడాది, మొక్కలు పెరగక, కాయలు కాయక, కొన్ని కాయలు కాసి, చీడ, పీడ పురుగుల వలన, రైతులు కంపెనీలు ప్రకటించిన దిగుబడులలో సగం కూడా సాధించలేకపోయారు. మార్కెట్లో ధర రాక మరింత నష్టపోయారు. అధిక ధరలకు తెచ్చిన పెట్టుబడులు కోల్పోయి అప్పుల బారిన పడ్డారు. రాబోయే పంటకు కూడా సరైన విత్తనాలు లేవని కంపెనీ ప్రతినిధులే చెబుతారు. ఇటువంటి తరుణంలో లక్షలు పెట్టి వ్యాపార ప్రకటనల ద్వారా రైతులను మభ్యపెట్టి మళ్లీ నాసిరకం పత్తి విత్తనాలు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు.

అసలు విత్తన ఉత్పత్తి ఎంత అయిందో తెలిపే సమాచారం ఎక్కడా కానరాదు. వ్యవసాయ శాఖ చెప్పే గణాంకాలు ప్రైవేటు విత్తనకంపెనీల ద్వారా వచ్చినవే. ఈ లెక్కలు విశ్వాసం కలిగించేవి కావు. తప్పుడు లెక్కలకు బాధ్యత వహించాల్సిన నిబంధన లేదు కనుక కాకి లెక్కలకు అంతే లేదు. అసలైన లెక్కలు లేవు కాబట్టి విత్తన కంపెనీలు, డీలర్లు విత్తనకొరత ఉందని వార్తలు సృష్టించి రైతులు నాసిరకం విత్తనాలు అధిక ధరకు కొనుగోలు చేసే పరిస్థితిని సృష్టిస్తున్నారు.

ఈనాడు ప్రధానంగా పత్తి విత్తనాల ఉత్పత్తి పూర్తిగా ప్రైవేటు పరిశ్రమ మీదనే ఆధారపడింది. అనేక ఇతర విత్తనాలలో కూడా ఆయా కంపెనీలే ప్రధాన 'భూమిక' పోషిస్తున్నాయి. దిగుమతులు చేసుకుంటున్నాయి. ధరలను అవే నిర్ణయిస్తున్నాయి. అధిక ఖరీదు విత్తనాలలో పూర్తిగా ప్రైవేటు పరిశ్రమ పాతుకుపోయింది. రైతులకు సరైన సమయంలో సరైన నాణ్యత కలిగిన అధిక దిగుబడి విత్తనాలు అందుబాటు ధరలలో ఎల్లప్పుడూ అందిస్తాయనే లక్ష్యంతో ప్రైవేటు విత్తనకంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించింది. దీనిని సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విత్తన కంపెనీలకు సొంతంగా విత్తన క్షేత్రాలంటూ  లేవు. రైతులను ప్రోత్సహించి తమ విత్తన అవసరాల మేరకు ప్రతి ఏటా ప్రైవేటు ఒప్పందాల ద్వారా విత్తన ఉత్పతి ఏర్పాట్లు చేసుకుంటారు. ఎన్ని ఎకరాలలో, ఎంత విస్తీర్ణంలో ఈ విత్తనఉత్పతి అవుతుందనే సమాచారం ఎవరి వద్ద ఖచ్చితంగా లేదు. కాకపోతే చట్టరీత్యా ప్రభుత్వానికి విత్తనఉత్పతి గురించి సమాచారం ఇవ్వాలి. స్థానిక మార్కెటింగ్ కమిటీ వద్ద కూడా ఇదే సమాచారం ఉండాలి. విత్తనలైసెన్స్ అవసరాల మేరకు ఈ సమాచారం ఉండాలి. కానీ, ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంవల్ల, నిర్లక్ష్యంవల్ల కంపెనీలు ఇచ్చే అరకొర సమాచారం మాత్రమే అందుబాటులో ఉంటున్నది.

బీటీ పత్తి అమ్మకాల మీద రాయల్టీ ద్వారా ఒకే బహుళ జాతి కంపెనీ ఏటా దాదాపు రూ.400 కోట్లు సంపాదిస్తున్నది. కానీ, ఈ కంపెనీ నాణ్యత మీద ఏమాత్రం జవాబుదారీతనం లేదు.

బీటీ పత్తి విత్తన ప్యాకెట్ మార్కెట్ ధరలో కేవలం 10 నుంచి 20 శాతం మాత్రమే విత్తనరైతులకు ఇవ్వడం జరుగుతున్నది. ఇందులో, కంపెనీ ఆర్గనైజర్లకు కూడా వాటా ఉంటుంది. బీటీ పత్తి విత్తనధరలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతూ విత్తనకంపెనీలు ప్రతి ఏటా ఒత్తిడి తెస్తూనే ఉన్నాయి. విత్తన రైతులకు సరైన ధర ఇవ్వకుండా, ఇప్పటి ధరల మీదనే అధిక లాభాలు గడిస్తున్న కంపెనీలు తమ అర్థ, అంగ, రాజకీయ బలంతో

విత్తనధరలు పెంచాలని ప్రభుత్వం మీద తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నాయి.

ప్రభుత్వ అధికారులు ఎప్పుడైనా స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించే ప్రయత్నం చేస్తే, ప్రభుత్వ అధికారాలను ప్రశ్నిస్తూ పెద్ద కంపెనీలు కేసులు వేసి కోర్టుల ద్వారా నష్ట పరిహారం రాకుండా అడ్డుకుంటున్నాయి. ప్రభుత్వాల మీద ఉన్న రైతుసంక్షేమ విధిని ఇవి సవాలు చేస్తున్నాయి. ఆయా కేసుల మీద వ్యవసాయ శాఖ సమర్ధవంతంగా, ధీటుగా వ్యవహరించకుండా అనేక శక్తులు అడ్డుపడుతున్నాయి.

2002లో ప్రైవేటు విత్తన పరిశ్రమ కూడా విత్తన ఉత్పత్తి పూర్తిస్థాయి పాత్ర నిర్వహించే విధంగా కేంద్ర ప్రభుత్వ విధాన మార్పు తర్వాత విత్తనరంగం అనేక మార్పులకు లోనయింది. చిన్న విత్తనసరఫరా కంపెనీల సంఖ్య తగ్గిపోయి, బహుళ జాతి విత్తనకంపెనీల పాత్ర పెరిగిపోయింది. అనేక పంట, కూరగాయవిత్తనాలలో విదేశీ కంపెనీల పెత్తనంతో ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. తక్కువ ధరకు చైనాలాంటి దేశాలకు విత్తనాలను ఎగుమతి చేసి కంపెనీలు లాభాలు గడిస్తున్నాయి. తక్కువ ధరకు తైవాన్ లాంటి దేశాలనుంచి కూరగాయల విత్తనాలు దిగుమతి చేసుకుని రైతులకు అధిక ధరలకు అమ్మడం వల్ల అటు రైతులు ఇటు వినియోగదారులు అధిక ధరలకు కూరగాయలు కొనాల్సి వస్తున్నది. కూరగాయల మార్కెట్లలో ధరలు పెరగడానికి విత్తనధరలు పెరగడం కూడా ఒక కారణం. అధిక ధరలు పెట్టలేని రైతులు, మార్కెట్లు పడేసిన కూరగాయల విత్తనాలు ఏరుకుని పండిస్తున్నారు. దీని వలన దిగుబడి రాకపోగా రైతులు నష్టపోతున్నారు. నాణ్యత కలిగిన కూరగాయలు అందుబాటులో లేక ప్రజలూ బాధపడుతున్నారు.

కొన్ని ప్రధాన వాణిజ్యపంటలకు, ప్రైవేటు కంపెనీలు సరఫరా చేసే విత్తనాలు మినహా ఇతర గత్యంతరం లేదు. అదనంగా, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థలు విత్తనాల మీద ఎలాంటి పరిశోధనలు కాని, విత్తనఉత్పతి కాని చేయడంలేదు. జాతీయస్థాయి నుంచి ఒక పెద్ద, విస్తృత ప్రభుత్వరంగ విత్తనవ్యవస్థ ఉన్నా, ప్రభుత్వ విత్తన కార్యక్రమాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి.

ఈనాడు అత్యంత ప్రమాదకరంగా, బీటీ తప్ప వేరే పత్తి విత్తనాలు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇది ఒక కంపెనీ తన లైసెన్స్ చట్రంలో ఇతర కంపెనీలన్నింటిని ఇరికించి, తన బీటీ పత్తి ఉత్పత్తినే కొనే విధంగా చేస్తున్న ప్రత్యక్ష చర్యల ఫలితం. సాధారణ హైబ్రిడ్, దేశీయ పత్తి విత్తనాల ఉత్పత్తి వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడంలో ఒక బహుళ జాతి కంపెనీ సఫలీకృతం అయింది. ఇదే కొనసాగితే పత్తిలోనే కాకుండా ముఖ్యమైన ఆహార

పంటలలో కూడా ఒకే కంపెనీ తన గుత్తాధిపత్యాన్ని, వ్యాపారాన్ని పెంచుకునే అవకాశం ఉంది.



పత్తి విత్తనాల ప్రస్తుత పరిస్థితి పాలకులకు, రైతులకు, సామాన్య ప్రజలకు ఒక గుణపాఠం. ఈ అనుభవం నుంచి బయటపడాలంటే, ప్రభుత్వం తగిన అధికారాలను సమకూర్చుకోవాలి. విత్తనవ్యవస్థ బాగుపడితే మనం, మన భావి తరాలు బాగుపడే అవకాశాలుంటాయి. విత్తనవ్యవస్థ బాగుపడాలంటే, విత్తనాల వైవిధ్యత కొనసాగాలి, నాణ్యత పెరగాలి, రైతులకు అందుబాటులో ఉండాలి.

ప్రస్తుత 2019 ముసాయిదా విత్తన బిల్లులో అనేక లోపాలున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాలకు విత్తనపరిశ్రమపై నియంత్రణ అధికారాలు ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. విత్తనధరల నియంత్రణ కూడా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉంచాలి. విత్తనధరల నిర్ణయంలో ఒక స్వతంత్ర సంస్థ చేసి నిర్ధారించిన ఉత్పత్తి ఖర్చులను పరిగణనలోకి తీసుకోవాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఆ దిశగా చర్యలు చేపట్టాలి. కేవలం, బీటీ పత్తి విత్తనం గురించి మాత్రమే కాకుండా అన్ని రకాల విత్తనాల ధరలు, నాణ్యత గురించి, వాటితో వ్యాపారం చేసే ప్రైవేటు పరిశ్రమకు సంబంధించి ఒక పారదర్శక వ్యవస్థ ఏర్పాటు చాలా అవసరం.

**రెండు రాష్ట్రాలలో వ్యవసాయం బాగుపడాలంటే విత్తనరంగంలో తీవ్ర మార్పులు అవసరం:**

1. రాష్ట్ర స్థాయిలో విత్తన చట్టం తీసుకురావాలి. విత్తన కంపెనీలను నియంత్రించే ఈ చట్టం వలన విత్తనం పండించే రైతులకు, విత్తనాలు నాటే రైతులకు ధరలు, నాణ్యత, లభ్యతలకు సంబంధించి రక్షణ కల్పించినట్లయితే విత్తనక్షేత్రాల వ్యాప్తి సాధ్యం అవుతుంది.

2. రాష్ట్రస్థాయి విత్తన సమాచారవ్యవస్థకు రూపకల్పన చేసి, రైతులకు సంబంధిత సమాచారం నిరంతరంగా అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాట్లు చేయాలి.

3. ప్రతి ఏటా విత్తనరంగం మీద ఒక నివేదిక రాష్ట్ర వ్యవసాయశాఖ తయారుచేసి విత్తనాల మీద అన్ని రకాల శాస్త్రీయ సమాచారం పొందుపరిచి మార్కెట్లలో అమ్మకాలు, కొనుగోళ్ల సమాచారం కూడా ఈ నివేదికలో చేర్చితే భవిష్యత్తు ప్రణాళికలకు, విధానాలకు

ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

4. విత్తన ఉత్పత్తిదారులకు (కంపెనీలు లేదా ఆర్గనైజర్లు), విత్తనాలు పండించే రైతుల మధ్య జరిగే ఒప్పందానికి చట్టబద్ధత కల్పించడం ద్వారా రైతుల ప్రయోజనాలను కాపాడాలి.

5. సహకారరంగంలో విత్తనఉత్పత్తిని ప్రోత్సహించాలి. విత్తన సహకారసంఘాలు ఏర్పాటుచేసి, తగిన సాంకేతిక, పెట్టుబడి, యాజమాన్య వసతులు ఏర్పాటు చేస్తే రైతులకు అధిక లాభాలను పొందే అవకాశం లభిస్తుంది. రైతుల నుంచి రైతులకు విత్తన సరఫరా నేరుగా జరిగేలా సంస్థాగత, వ్యాపార వ్యవస్థలను ప్రోత్సహించాలి.

6. విత్తన ఎగుమతి–దిగుమతుల కేంద్రాన్ని రాజధానిలో ఏర్పాటు చేసి చిన్న, దేశీయ కంపెనీలను విత్తన సహకారసంఘాలతో అనుబంధం చేసి విత్తనవ్యాపారానికి వెసులుబాటు కల్పించాలి.

7. పబ్లిక్ రంగంలో, వ్యవసాయ కళాశాలలు, విశ్వవిద్యాలయాల ద్వారా విత్తనాల మీద పరిశోధనలను, విత్తనక్షేత్రాల సదుపయోగాన్ని ప్రోత్సహించాలి.

8. రైతులసంక్షేమం దృష్ట్యా హైకోర్టులో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి. నాసిరకం విత్తనాలు సరఫరా చేస్తూ రైతులను, వ్యవసాయాన్ని, ఆహార ఉత్పత్తిని అడ్డుకుంటున్న కంపెనీలు నష్టపరిహారం అందించే విధంగా చట్ట సవరణలు చేయాలి. కేసుల ద్వారా ప్రభుత్వ అధికారాలను నిర్వీర్యపరిచే కంపెనీల ప్రయత్నాలను తిప్పికొట్టాలి. కంపెనీలకు ఈ దిశగా గుణపాఠం నేర్పాలి.

9. రైతులు స్వతహాగా విత్తనాలు తయారు చేసుకునే విధంగా పథకాలు ప్రవేశపెట్టాలి. రైతులలో ఉన్న విత్తన పునరుత్పత్తిదారులను (Breeders) ప్రోత్సహించాలి. వారి పరిశోధన ఫలితాలను అందరికీ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేయాలి.

10. పరిస్థితిని సరిదిద్ది విత్తనధరలను నియంత్రించి, విత్తనాల నాణ్యతను పెంచే విధంగా చర్యలు చేపట్టవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉంది.

★★★

# విత్తనాలు : కోల్పోతున్న స్వాతంత్ర్యం

వ్యవసాయంలో విత్తనాల సమస్య రోజు రోజుకు తీవ్రమవుతున్నది. హరిత విప్లవం పేరిట మొదలుపెట్టిన మార్పు విత్తనాలతోనే మొదలైంది. అధిక దిగుబడి వంగడాల వల్ల దిగుమతి పెరుగుతుందనే హామీతో మొదలైన ఈ రకం మార్పు క్రమంగా రైతులను విత్తనాల నుంచి దూరం చేసింది. 1960 దశకంలో మొదలు పెట్టిన ఈ మార్పు 2025 నాటికి తీవ్రరూపం దాల్చింది. ఆహార నాణ్యత దిగజారడానికి విత్తనాలలో వచ్చిన మార్పులే కారణం. దేశీ విత్తనాలను తులనాడి, భారత వ్యవసాయాన్ని హీనపరిచి తీసుకువచ్చిన హరిత అధిక దిగుబడి వంగడాలు క్రమంగా రైతుల విత్తన స్వతంత్రాన్ని, స్వావలంబనను హరించాయి. దిగుబడులు పెంచే ప్రత్యామ్నాయ ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఇచ్చిన హామీలను మరిచి ప్రభుత్వ రంగాన్ని మొదట్లో ముందట పెట్టి తదుపరి ప్రైవేటు విత్తన కంపెనీల మాయలోకి రైతాంగాన్ని నెట్టాయి.

అయితే విదేశీయుల ప్రోత్సాహంతో ప్రవేశపెట్టిన వంగడాలు అధిక దిగుబడి ఇవ్వడానికి ప్రధాన కారణం రసాయన ఎరువులు. రసాయన ఎరువులు ఉపయోగించని పరిస్థితులలో ఈ వంగడాలు ఉపయోగపడలేదు. ఉపయోగపడవు. ఆ విధంగా మొదలుపెట్టిన రసాయన ఎరువుల వాడకం ఈనాడు విధిగా, అత్యధిక స్థాయిలో వాడాల్సిన పరిస్థితికి తీసుకువచ్చింది. పరిశోధన చేసి ప్రవేశపెట్టిన హైబ్రిడ్ లేదా అధిక దిగుబడి వంగడాలు, ఎరువులు, కీటకనాశక రసాయనాల వాడకాన్ని పెంచాయి. ఈ రకం విత్తనాలు అధిక దిగుబడి మొదట్లో చూపెట్టినా క్రమంగా వాటి ఉత్పాదకత తగ్గింది. దిగుబడి తగ్గుతుందని గుర్తించి ఒక కొత్త వాదనను ప్రవేశపెట్టారు శాస్త్రవేత్తలు. అది విత్తన మార్పిడి రేటు (Seed replacement rate). హైబ్రిడ్, లేదా ఆధునిక విత్తనాలను, ఎప్పటికప్పుడు మార్చాలి. మార్చితేనే దిగుబడి. మార్చితేనే మంచి ఫలితాలు అని చెబుతూనే ఉంటారు. సత్ఫలితాలు అంటే కేవలం దిగుబడి మాత్రమే కాదు. చీడ, పీడ, పురుగు భూషి పట్టడం తగ్గుతుంది. అంకురోత్పత్తి కూడా పెరుగుతుంది. అంటే వంద గింజలు వేస్తే ఎక్కువ శాతం మొలకెత్తుతాయి. అది ఎప్పుడూ వంద శాతం లోపే ఉంటుంది. ఏ ఆధునిక విత్తన రకానికైనా వంద శాతం మొలకెత్తడం అంటూ ఉండదు. రైతులను మభ్యపెట్టే మరో సిఫారసు కూడా చేశారు. ఎకరాకు ఎన్ని గింజలు వెయ్యాలనేది ఒక్కో పంటకు ఒక్కో కొలమానం ఉంటుంది. అయితే అంకురోత్పత్తి వంద శాతం ఎప్పుడు ఉండదు కనుక ఈ కొలమానంలో మార్పులు తెచ్చి ఎకరాకు ఎక్కువ విత్తనాలు వాడే విధంగా రైతులకు సిఫారసు చేయడం మొదలు పెట్టారు. వరి పంటకు కొందరు రైతులు ఎకరాకు 18 నుంచి 20 కిలోలు వాడుతుంటే, పరిజ్ఞానం ఉన్న రైతులు కేవలం 250 గ్రాముల దేశీ వరి విత్తనాలు వాడుతున్నారు. ఎంత తేడా? ఇక విత్తనాల నాణ్యత క్రమంగా

పడిపోతున్న నేపథ్యంలో రైతు తనంతట తానుగా ఎక్కువ విత్తనాలు వాడడం అలవాటు అయిపోయింది. మిర్చి, పత్తి, వరి, గోధుమలు, టమాట వంటి పంటలలో నాసి రకం విత్తనాల వల్ల లాభపడుతున్నది ప్రైవేటు కంపెనీలు. నష్టపోతున్నది రైతులు.

ఈ రకమయిన మార్పుల వల్ల రైతుకు విత్తనాల మీద పెట్టె ఖర్చు పెరిగింది. ఈ ఆధునిక విత్తనాల వల్ల సాగు ఖర్చు పెరిగింది. ఒకప్పుడు రైతు తన విత్తనాలు దాచుకుని వాడే రోజులలో విత్తనాల మీద సున్నా ఖర్చు ఉండేది. రైతుకు విత్తనాల మీద పరిజ్ఞానం ఉండేది. వేరే రైతు దగ్గర విత్తనాలు తెచ్చుకున్నా నమ్మకం ఉండేది. రైతు తన విత్తనాలు కోల్పోయి ఆధునిక విత్తనాలకు అలవాటు పడ్డ తరువాత విత్తనాల మీద జ్ఞానం, నమ్మకం పోయాయి. ఆధునిక విత్తనాలకు చీడ పీడ బెడద పెరిగింది. దానికి పరిష్కారంగా వాడుతున్న కీటకనాశక రసాయనాల వాడకం పెరిగింది. వాటి వల్ల ఖర్చు పెరిగింది. ప్రమాదకరమైన రసాయనాలు కాబట్టి వాటిని వాడే క్రమంలో రైతు ఆరోగ్యం కూడా ప్రమాదంలో పడింది.

ఆధునిక విత్తనాలకు అధిక పోషకాలు ఇవ్వాలని చెప్పి, పొలం మట్టిలో అవి లేవు అని ఊదరగొట్టి రసాయన ఎరువుల వాడకం రైతులకు అలవాటు చేశారు. ఒకప్పుడు ఎకరాకు ఒకటో రెండో ఎరువుల బస్తాల వాడకం నుంచి ఇప్పుడు విధిగా 15 బస్తాలు వాడే దుస్థితికి రైతు చేరుకున్నాడు. రసాయన ఎరువులు లేనిదే పంట పండదన్న గట్టి విశ్వాసం ఏర్పడింది రైతుకు. దరిమిలా ఖర్చు పెరిగింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ఎరువులకు సబ్సిడీ ప్రభుత్వం ఇస్తున్నా, ఎకరా సాగు ఖర్చులో రసాయన ఎరువుల భారం అంతకంతకు పెరుగుతున్నది. వరి, గోధుమ పంటలతో మొదలైన ఈ ఆధునిక విత్తన కేంద్రీకృత వ్యవసాయం క్రమంగా అన్ని పంటలకు విస్తరించింది. హరిత విప్లవంగా నామకరణం చేసిన ఆధునిక వ్యవసాయ పద్దతులు ప్రధానంగా మార్చింది విత్తనాలనే!

బోర్లాగ్ ప్రవేశపెట్టిన అధిక దిగుబడినిచ్చే విత్తనాలకు ఖరీదైన ఎరువులు మాత్రమే కాకుండా, వాటికి ఎక్కువ నీరు కూడా అవసరం. ఈ రెండింటి కొరత ఎప్పుడూ ఉండేదే. ఇప్పుడు ఇంకా ఎక్కువగా ఉంది. ఆధునిక మొక్కల బ్రీడింగులో వచ్చిన విప్లవం వల్ల గ్రామీణ పేదరికం, పెరిగిన అప్పులు, సామాజిక అసమానతలు, ఆత్మహత్యలు, వలసలు పెరిగాయి. మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. వ్యవసాయ కూలీ కుటుంబాలతో మొదలైన వలసలు రైతులను కూడా తాకాయి. ఇంకొక వైపు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయం మీద సలహాలు ఇచ్చే కంపెనీలు పెరిగాయి. వాటి వార్షికాదాయం యేటా పెరుగుతున్నది. రైతులు చితికిపోతుంటే ఈ కంపెనీలు తమ డీలర్లకు విదేశీ పర్యటనలు, విందులు నిర్వహిస్తున్నారు. తమ వ్యాపారం పెంచుకుంటున్నారు. ఇబ్బడిముబ్బడిగా లాభాలు గడిస్తున్నారు. బహుశ నార్మన్ బోర్లాగ్ కూడా ఈ విధమైన పరిణామం ఊహించి

ఉండకపోవచ్చు. వ్యవసాయ ఉత్పత్తిలో అద్భుతాలు లేవు అని చెప్పిన ఈ వ్యక్తి, ప్రపంచానికి ఆహార భద్రత సాధించాలని మొదలు పెట్టిన 'ఆధునిక విత్తనాల' వ్యవసాయం జీవ వైవిధ్యాన్ని, జీవనోపాధులను నాశనం చేస్తున్న విషయం పట్ల స్పందించలేదు. 'అధిక వంగడాల' వల్ల దిగుబడి పెరుగుతుందనే ఏకైక సూత్రం మీద పని చేసిన ఈ మహానుభావుడు తద్వారా నిర్మాణమైన 'దోపిడీ' వ్యవస్థ గురించి కించిత్తు కూడా ఆలోచించలేదు. పంటల దిగుబడి పెరిగితే మార్కెట్లో గిట్టుబాటు ధర రాదు అని రైతుల అనుభవం. పంటల దిగుబడి వల్ల దేశం పురోగతి చెందుతుందని భావించినా దానికి కొనసాగింపుగా రైతును అధోగతి పాలు చేస్తున్న వాస్తవం ఇప్పటికీ ఒప్పుకోని 'హరిత విప్లవ' మద్దతుదారులు ఆహార భద్రత సాధించాలంటే 'ఆధునిక విత్తనాలు' వాడాలనే పాత పాట పదే పదే పాడుతుంటారు..

ఇప్పుడు 'ఆధునిక విత్తనాలు' రైతుల చేతులలో లేవు. విత్తన, పెస్టిసైడ్ కంపెనీల గుప్పిట్లో ఉన్నాయి. ఈ విత్తనాల మీద తమ ఆధిపత్యం కొనసాగించడానికి 'చట్టాలను తమ చుట్టాలుగా' మార్చుకున్నాయి ఈ కంపెనీలు. తాము కోట్ల రూపాయల పెట్టుబడి పరిశోధనల మీద పెట్టి సాధించిన అధిక దిగుబడి విత్తనాల మీద 'మేధో హక్కుల సంపత్తి' పేరిట చట్టం ద్వార రక్షణ పొంది తమ వ్యాపారాన్ని, విత్తన మార్కెట్లను సురక్షితం చేసుకున్నారు. అయితే ఎప్పటికప్పుడు దిగుబడులు తగ్గిపోతున్న నేపథ్యంలో యేటా కొత్త 'విత్తనాలు' మార్కెట్లో ప్రవేశపెట్టి అటు ప్రభుత్వాలను, ఇటు రైతులను మభ్యపెడుతూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

మన దేశంలో విత్తనాలు, ప్రకృతి వనరుల మీద మేధో సంపత్తి హక్కులు పొందే అవకాశం లేదు కనుక ఇతర మార్గాలలో తమ వ్యాపారాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. పెద్ద కంపెనీలు సిండికేట్ అయ్యి చిన్న కంపెనీలను గుప్పిట్లో పెట్టుకుంటున్నాయి. మార్కెట్ ఒప్పందాలు చేసుకుని దేశి, చిన్న కంపెనీలకు 'బంధనాలు' వేశారు. ప్రశ్నిస్తే కేసులు పెడతారు. ప్రభుత్వంపై రైతుల పేరు మీద ఒత్తిడి తెస్తారు. ప్రభుత్వం ఏవన్నా 'చర్యలు' చేపడితే కోర్టుకు వెళతారు. విత్తన కంపెనీలు కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మీద వేసిన కేసులు కొన్ని వందల సంఖ్యలో ఉన్నాయి.

వ్యవసాయ, ఉద్యానవన, అలంకార మొక్కల జాతులలో పరిశోధన, పెంపకం, ఉత్పత్తి, మార్కెటింగ్‌లో ప్రభుత్వ నియంత్రణ మృగ్యం. అనేక పంటలకు ఏనాడో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పరిశోధన, శిక్షణ సంస్థలు విత్తనాల రంగంలో తమవంతు పాత్ర పోషించడం ఏనాడో మానేసాయి. వరి లాంటి పంటల విత్తనాల మీద పరిశోధనలు చేస్తూ కొత్త వంగడాలు సృష్టిస్తున్నా అవి రైతులకు అందకుండా ఒక కుట్రపూరిత వ్యవస్థ నడుస్తున్నది. జన్యు మార్పిడి బిటి పత్తి విత్తనాల వల్ల పర్యావరణం నాశనం అవుతున్నది.

రైతులకు గులాబీ పురుగు బెడద పదింతలు పెరిగింది. యేటా దాదాపు రూ.27 వేల కోట్లు వ్యవసాయ పరిశోధన మీద ఖర్చు అవుతున్నది. రైతుకు మాత్రం వచ్చే ఫలితం సున్నా. 'ల్యాబ్ to ల్యాండ్' కేవలం ఉపన్యాసాలకే పరిమితం అయింది. దరిమిలా వివిధ పంటల విత్తనాల మీద పరిజ్ఞానం ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్తల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతూ వస్తున్నది.

రైతులలో విత్తనాల విజ్ఞానం కొండలా పెరగాల్సిన పరిస్థితులలో ప్రైవేటు గుత్తాధిపత్యం పెరిగినందువల్ల వారికి అందడం లేదు. రానురాను విత్తన విజ్ఞానాన్ని రహస్యంగా మార్చుతున్నారు విత్తన శాస్త్రవేత్తలు, కంపెనీలు. పెరుగుతున్న వ్యాపారానికి ఈ పరిశోధన కొందరి గుప్పిట్లో వ్యాపార ఎత్తుగడగా మారింది. అందరికి చెందాల్సిన విత్తన విజ్ఞానం కొందరికే పరిమితం అవుతున్నది. వారి వ్యక్తిగత సంపద సృష్టికి అదే మూల స్తంభంగా మారింది. ఇక్రిసాట్, ఇర్రి వంటి అంతర్జాతీయ సంస్థలు విత్తన పరిశోధనల సాకుతో భారతీయ జన్యుసంపద తీసుకుని, క్రమంగా ప్రైవేటు పెట్టుబడిదారులకు అందజేస్తున్నాయి. రైతులకు ఇస్తామని ప్రకటనలు ఇస్తున్న ఆయా సంస్థల గేట్లవద్ద ఉండే సెక్యూరిటీ వారిని లోపలికి కూడా రానీయడం లేదు. 1966 తరువాత నిర్మాణమైన ప్రభుత్వ విత్తన వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయింది. ఇప్పుడు ఉన్న సంస్థలు, కమిటీలు, శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలు ఉత్సవ పాత్రకే పరిమితమై ప్రైవేటు కంపెనీల ప్రయోజనాలను పరోక్షంగా కాపాడుతున్నాయి. ప్రభుత్వ రంగంలో ఏదో జరుగుతున్నట్లు భ్రమ కల్పించడానికే అవి ఉపయోగపడుతున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యానికి, దేశాభివృద్ధికి, ఉమ్మడి ఐశ్వర్యానికి మూలకారణమైన విత్తన రంగాన్ని ప్రైవేటుపరం చేస్తూ, ఉన్న ఒకే ఒక చట్టాన్ని కూడా అమలు చేయడం లేదు. 1966లో ప్రభుత్వరంగంలో విత్తనాల నాణ్యత, సరఫరా మీద శాస్త్రీయ నియంత్రణకు తీసుకు వచ్చిన విత్తన చట్టం ప్రైవేటు విత్తనాలకు వర్తింపచేయడానికి సిద్ధంగా లేదు. 2004లో ఒక కొత్త చట్టం తీసుకు వచ్చే ప్రయత్నం ప్రైవేటు విత్తన కంపెనీల వ్యాపారం వెసులుబాటును సరళీకృతం చేయడానికేనని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో 20 యేండ్ల తర్వాత కూడా అది రూపుదాల్చలేదు. ఇప్పటి వరకు ప్రతిపాదించిన 4,5 ముసాయిదాలు రైతుల ప్రయోజనాలు కాపాడడానికి, భారతదేశంలో ఉన్న అపార విత్తనసంపద స్వచ్ఛత, పరిరక్షణకు ఉద్దేశించినవి కావు. రైతులు, కంపెనీల ప్రయోజనాల మధ్య కంపెనీల పక్షం వహిస్తున్న కేంద్రప్రభుత్వం కొత్త చట్టం తీసుకువరావడానికి వెనుకంజ వేస్తున్నది. రైతుల ప్రయోజనాలు, నాణ్యమైన విత్తన సరఫరా, విత్తన రంగం మీద నియంత్రణ, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు, విత్తన ధరల నియంత్రణ వగైరా అంశాలతో కూడిన విత్తనచట్టం ఇప్పటి వరకు రాకుండా చేయడంలో

విత్తన కంపెనీలు విజయం సాధించాయి. ఈ కంపెనీలు విత్తనచట్టం తీసుకురాకుండా అడ్డుపడడమే కాదు, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవసాయం, విత్తనాల మీద రాష్ట్ర స్థాయిలో చట్టాలు రాకుండా కూడా అడ్డుకుంటున్నాయి.



చట్టం, ప్రభుత్వ నిఘా, నియంత్రణ లేని విత్తన వ్యాపారం వల్ల ఆహార భద్రత, పోషకాల భద్రత ప్రమాదంలో పడ్డాయి. రైతు ఆదాయం కుంటుపడడానికి ఇది కూడా ఒక కారణం. నాసి రకం విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరుగుతున్నది. వ్యవసాయంలో రైతుల మీద అప్పుల భారం పెరగడానికి ఈనాటి ప్రధాన కారణం నియంత్రణ లేని విత్తన వ్యాపారమే. పదే పదే ప్రకటించాల్సి వస్తున్న రుణమాఫీ పథకాల విస్తృత ప్రయోజనాలు ఈ అప్పుల ద్వారా ఇటువంటి కంపెనీల ఖాతాలలోకి ముందే చేరుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఆహార పంటల దిగుమతి పెరగడానికి విత్తనాలలో ప్రైవేటు గుత్తాధిపత్యం కూడా ఒక కారణం. పప్పులు, లవంగాలు, ఉల్లిగడ్డలు, పసుపు, ఎల్లిపాయలు తదితర పంటల దిగుమతి పెరగడానికి విత్తన వైఫ్యల్యాలు కూడా కారణం. ఇందులో స్వార్థ రాజకీయ నాయకుల 'వ్యాపారాలు' కూడా ఉన్నాయి. డీలర్ల స్థాయి నుంచి బినామీ పెట్టుబడుల వరకు వీరి ప్రయోజనాలు ఉండడం వల్ల నాసిరకం విత్తనాల మీద చర్యలు చేపట్టటానికి అధికారులు వెనుకాడుతున్నారు.

విత్తనాల మీద స్వావలంబన అత్యంత మౌలికమైన అవసరం. రైతులకు విత్తన స్వాతంత్ర్యం కోసం రాష్ట్రాలు చట్టాలు తీసుకురావాలి. రైతుల పరిజ్ఞానం పెంచే విధంగా విత్తన వ్యవస్థను నిర్మించాలి. విత్తన జన్యుసంపదను కలుషితం కాకుండా కాపాడాలి. చట్ట వ్యతిరేకంగా పర్యావరణానికి, జన్యుసంపదకు హాని చేసే విత్తనాలను ప్రవేశపెట్టే కంపెనీలు, సంబంధిత వ్యక్తుల మీద క్రిమినల్ చర్యలు చేపట్టాలి. గ్రామీణస్థాయి నుంచి విత్తనాలను రైతుల స్వేచ్ఛగా ఇచ్చి పుచ్చుకునే పద్ధతులను ప్రోత్సహించాలి.

★★★

# విత్తనంపై పెత్తనం

**(రైతుకు పూర్తిగా మేలు చేయని జాతీయ విత్తనచట్టం ముసాయిదా-2019)**

**నేపథ్యం**




విత్తనాలు వ్యవసాయాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి, ఆహారఉత్పత్తిలో కీలకపాత్ర వహిస్తుంది. నాణ్యమైన, అధిక దిగుబడి ఇచ్చే విత్తనాల మీద ఎప్పటినుంచో ప్రభుత్వరంగ పరిశోధన సంస్థలు దృష్టి సారించాయి. రైతులు మంచి నాణ్యమైన విత్తనాలు వాడాలని ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో విత్తనాలకు సంబంధించి ఒక కొత్త చట్టం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నది.

విత్తనాలకు సంబంధించి జాతీయంగా, అంతర్జాతీయంగా అనేక మార్పులు వచ్చాయి. ప్రైవేటురంగంలో, విత్తన కంపెనీలు విపరీతంగా లాభాలు ఆర్జిస్తున్నాయి. బహుళ జాతి విత్తన కంపెనీల గుత్తాధిపత్యం పెరుగుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా ఆరు పెద్ద కంపెనీలు, ఇప్పుడు మూడు అయినాయి. విత్తనాలు, విషరసాయనాల వ్యాపారం జోడు గుర్రాలుగా వాడుకుంటూ, దానికి తగిన శాస్త్ర సాంకేతిక జ్ఞానం జోడిస్తూ, అనుకూల శాస్త్రవేత్తలు, అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో కంపెనీలు అత్యంత వేగంగా ఎదుగుతున్న పరిస్థితులలో, విత్తన వ్యాపారం మీద నియంత్రణ కోరుతున్న రైతుపక్ష సంఘాల ఒత్తిడి మేరకు, ఈ ముసాయిదా వచ్చిందని మనం భావించాలి.

అయితే, రాబోయే చట్టంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే ఈ బిల్లుకు రాజ్యసభ ఆమోదం లభించింది. లోక్‌సభ ఆమోదం పొందవలసి ఉంది.

**విత్తనాల పట్ల ప్రభుత్వ విధానాలు-చట్టాలు**

వీటిలో 1966 విత్తనచట్టం, 1983లో విత్తననియంత్రణ ఉత్తర్వు, 1988లో విత్తనవిధానం, 2002లో జాతీయ విత్తనవిధానం చాలా ముఖ్యమైనవి. అదనంగా విత్తనపరిశ్రమకు పారిశ్రామిక చట్టాలు, విదేశీ పెట్టుబడుల విధానాలు కూడా వచ్చి చేరాయి. సెప్టెంబర్ 2001లో మొక్కల వంగడాల రక్షణ, రైతుహక్కుల చట్టం (Plant Variety Protection and Farmer's Rights Act) చేశారు. ప్రైవేటు కంపెనీల ఒత్తిడితో విత్తనాల మీద పేటెంట్ హక్కుల అమలు కొరకు వివిధ దేశాల మీద అమెరికా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో మన రైతుల విత్తనహక్కులు కాపాడడానికి ఈ చట్టం రూపకల్పన జరిగింది. బహుశా, దీనికి విరుగుడుగా ప్రైవేటు కంపెనీల ప్రయోజనాలు విస్తృతం చేసే

క్రమంలో జూన్ 2002లో నూతన విత్తనవిధానం ప్రకటించారు. ఈ విధానంలో తొలిసారిగా నియంత్రణ వ్యవస్థలో మార్పులు చేయడం జరిగింది. మన విత్తనవ్యవస్థలో ప్రైవేటు విత్తనాలకు స్థానం కల్పించారు.

1966 విత్తనచట్టం, 1983 విత్తన నియంత్రణ ఉత్తర్వులు వంగడాల విడుదల, విత్తనపరీక్షలు, విత్తనధృవీకరణ వంటి ప్రక్రియలకు చట్టపరమైన వ్యవస్థను, పద్ధతులను నిర్వచించాయి. విత్తనవంగడాలు అనేక ప్రదేశాలలో కనీసం మూడు సంవత్సరాల పాటు జరిపే పరీక్షల అనంతరం విడుదల చెయ్యడం జరుగుతుంది. ఆ విధంగా విడుదల చేసిన విత్తనాలను ప్రభుత్వపరంగా ప్రకటించటం (Notify) జరుగుతుంది. అన్ని ప్రభుత్వరంగాలకు ఈ పద్ధతి వర్తిస్తుంది. కానీ, ప్రభుత్వేతర విత్తనాలకు ఈ పద్ధతి పాటించనవసరం లేదు.

విత్తన నియంత్రణ ఉత్తర్వు ద్వారా విత్తనాలను అత్యవసర వస్తువుల చట్టపరిధిలోకి తీసుకువచ్చారు. ఈ చట్టం ద్వారా అత్యవసర వస్తువుల అమ్మకాలు, కొనుగోళ్లపై నియంత్రణ ఉంటుంది. ఆ విధంగా ఆయా వస్తువుల ధరలపైన కూడా ప్రభుత్వానికి అధికారం ఉంటుంది. దీని ప్రకారం విత్తనాలు అమ్మే దుకాణాలు లైసెన్స్ తీసుకోవడంతోపాటు కొన్ని పద్ధతులను పాటించాలి. ఉదాహరణకు దుకాణం ముందర అమ్మే వస్తువుల నిల్వ, ధరలను సూచిస్తూ ఒక బోర్డు ఏర్పాటు చేయాలి.

విత్తనవిధానం 2002లో ప్రాథమిక మార్పులు ప్రతిపాదించారు. దీని ప్రకారం విత్తనరకాల విడుదల అన్ని రకాలకు వర్తిస్తుంది.

కేంద్రం తొలిసారి 1966లో విత్తనచట్టం చేసి 1983లో దానికి సవరణలు చేసిన తర్వాత కూడా సవరణలు మినహా మారుతున్న పరిస్థితుల మేరకు జాతీయస్థాయిలో ఓ సమగ్ర విత్తనచట్టం లేకపోయింది. 2002లో విత్తన విధానంలో మార్పు తర్వాత బహుళ జాతి కంపెనీల ప్రవేశం సులభం అయింది. బీటీ పత్తి విత్తనంతో వ్యవసాయంలో విపరీత మార్పులు వచ్చాయి. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. వివిధ రాష్ట్రాలు రైతుల ఒత్తిడి మేరకు ప్రభుత్వం తమస్థాయిలో చట్టం తీసుకురావాలని ప్రయత్నం చేసినా, విత్తనకంపెనీల ఒత్తిడి వల్ల అది సాధ్యపడలేదు. సంస్కరణల తర్వాత 2004లో అప్పటి ప్రభుత్వం ఓ ముసాయిదా బిల్లును తయారుచేసి రాజ్యసభలో ప్రవేశపెట్టింది. తదుపరి పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు దానిని పంపింది.

పలు అంశాలపై అధ్యయనం చేసిన ఈ కమిటీ రైతు ప్రయోజనాలను కాపాడేందుకు చేపట్టాల్సిన చర్యలపై 2006లో అనేక సిఫారసులు చేసింది. ఈ సిఫారసులపై పలుమార్లు అన్ని రాష్ట్రాలతో సంప్రదించాక కేంద్రం 2010లో రాజ్యసభలో సవరణలతో మళ్ళీ దానిని ప్రవేశపెట్టింది. అనేక మంది వ్యక్తులు, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రైతుసంఘాలు స్వచ్ఛంద సంస్థల అభ్యంతరాల నేపథ్యంలో, కొంతమంది పార్లమెంట్ సభ్యులు ఈ బిల్లుకు కొన్ని సవరణలు ప్రతిపాదించారు. కాని, ప్రభుత్వం వాటిని

పరిగణనలోనికి తీసుకోలేదు. ఇప్పుడు, 2004 ముసాయిదా ప్రతికి కొన్ని మార్పులు చేర్పులు చేసి 2019 విత్తనచట్టం ముసాయిదా ప్రజల అభిప్రాయాల కొరకు నవంబరు నెలలో వెబ్‌సైట్‌లో పెట్టారు. అభిప్రాయాలకు కేవలం 13 రోజుల సమయం మాత్రమే ఇచ్చారు.

సొంత పొలాల్లో విత్తనాలను ఉపయోగించుకోవడం తెలిసిన రైతుల నుంచి విత్తనాలను బదులు తీసుకోవడం నుంచి కొనుగోలు చేయడం వరకు భారతీయ రైతాంగం మార్పు చెందింది. ప్రస్తుతం దేశంలో దాదాపు  పదిహేను వేల కోట్ల రూపాయల విత్తనవ్యాపారం జరుగుతున్నది. ఏటా ఇది 12 శాతం మించి వృద్ధి సాధిస్తున్నది. దేశంలో సరఫరా అవుతున్న విత్తనాల్లో 46 శాతం వ్యవస్థీకృత ప్రయివేటు కంపెనీల ద్వారానూ, 41 శాతం ప్రభుత్వరంగ సంస్థలు, అవ్యవస్థీకృత ఏజెన్సీల ద్వారానూ, 13 శాతం వ్యాపారుల ద్వారా జరుగుతున్నది. దేశంలో 500 ప్రయివేటు విత్తన కంపెనీలు ఉన్నాయి. మూడోవంతు మూలవిత్తనాలు బహుళజాతి కంపెనీలకు సంబంధించినవే.

హైబ్రిడ్ విత్తనాలు, బీటీ విత్తనాల మీద రైతులు పూర్తిగా ఆధారపడే పరిస్థితి వచ్చింది. నకిలీ విత్తనాల బెడద నానాటికీ పెరుగుతున్నది. అధికార యంత్రాంగం అనేక విధాలుగా హైబ్రిడ్ విత్తనాల వ్యాప్తికి దోహదం చేస్తున్నది. ప్రతి ఏటా విత్తనాలు మార్చాలని రైతులకు సూచనలిస్తూ విత్తన వ్యాపారవ్యాప్తికి దోహదపడుతున్నది.

వరి, పత్తి, కూరగాయలు, మొక్కజొన్న విత్తనాలను ఎప్పటికప్పుడు మార్చడానికి రైతులు అలవాటు పడుతున్నారు. అయితే  నకిలీ విత్తన కంపెనీల వల్ల అక్కడక్కడ  రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గోదావరి జిల్లాలో మినప రైతులు రబీ సీజన్‌లో భారీగా నష్టపోవడానికి విత్తనసంస్థలే కారణం. విత్తనకంపెనీల వ్యాపారం పైన నియంత్రణ లేదు. నష్టపోయిన రైతులకు విత్తన కంపెనీలను బాధ్యులుగా చేయాలి.

బహుళ జాతి కంపెనీల వ్యాపార అవకాశాలను పెంచుతూ, దేశ రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఈ చట్టం ఊపిరి పోసుకుంది. తమ అవసరాలు, ఆకాంక్షలను ప్రతిఫలిస్తుందనుకున్న 'విత్తనబిల్లు–2004' అన్నదాతలకు ప్రమాదకారిగా మారింది.

**ఈ బిల్లులో పొందుపరిచిన ముఖ్య ఉద్దేశాలు:** విత్తనఉత్పత్తి, పంపిణీ నియంత్రణ ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందచేయడం. విత్తనానికి సంబంధించి మనదేశంలో ఉన్న విస్తృత, వైవిధ్యభరితమైన పద్ధతులు, వ్యవస్థలు ఉన్నందున ఈ చట్టం ప్రైవేటు విత్తనపరిశ్రమ నియంత్రణకు పరిమితం చేసే విధంగా లక్ష్యం కలిగి ఉండాలి.

కంపెనీల వ్యాపార అవకాశాలను పెంచడానికే ఈ బిల్లులో ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని రైతు, స్వచ్ఛంద సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. రైతుల శ్రేయస్సును కాంక్షిస్తూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన కీలక సిఫారసులకు ఇందులో చోటు దక్కకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. సుమారు పదిహేను ఏళ్ళ అనంతరం చట్టం కాబోతున్న

విత్తన ముసాయిదాపై దేశవ్యాప్తంగా రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే, 2019 విత్తనచట్టం ముసాయిదా ఈ ఆశలను వమ్ము చేస్తూ బహుళ జాతి కంపెనీలపై ప్రేమ కనబరిచింది. స్టాండింగ్ కమిటీ చేసిన సిఫారసుల్లో ఈ కంపెనీలకు వ్యతిరేకంగా ఉన్న వాటిని తొలగించి ఈ బిల్లును ఆమోదించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ప్రధానంగా విత్తన బిల్లులో ధరలు, రాయల్టీల నియంత్రణ ప్రస్తావన ఉన్నా, అవసరం అయినప్పుడే నియంత్రిస్తామని చెప్పడంతో, ఇంకొక ప్రక్రియకు తెర లేపినట్టయింది. విత్తనధరలు, రాయల్టీల విషయంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా తీవ్రస్థాయిలో వివాదం జరుగుతోంది. బహుళ జాతి కంపెనీలు ఇష్టమొచ్చినట్లు ధరలను నిర్ణయిస్తూ రైతుల నడ్డి విరవడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వాలపైనా స్వారీ చేస్తున్నాయి.

ధరల నియంత్రణ విషయంపై స్టాండింగ్ కమిటీ చేసిన సిఫారసులను పక్కకు పడేశారు. ఈ బిల్లు చట్టమైతే విత్తన కంపెనీలకు గుత్తాధిపత్యం లభిస్తుందని, విత్తన ధరలు, రాయల్టీని ఇష్టమొచ్చినట్లు నిర్ణయించుకోవడానికి అవకాశం లభిస్తుందని రైతుసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**రాష్ట్ర అధికారాల కుదింపు**

వ్యవసాయం రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశం. తాజా బిల్లులో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర, అధికారాలు పరిమితం కాబోతున్నాయి. సెక్షన్ 3 ప్రకారం... దేశవ్యాప్తంగా ఈ చట్టం అమలుకు ఢిల్లీ కేంద్రంగా జాతీయస్థాయిలో విత్తనకమిటీని ఏర్పాటు చేస్తారు. కమిటీ చైర్మన్, సభ్యులను కేంద్రమే నియమిస్తుంది. రాష్ట్రాల ప్రాతినిధ్యం నామమాత్రమే. దేశంలోని 5 భౌగోళిక జోన్లలో ఒక్కో జోన్ నుంచి ఒక రాష్ట్ర ప్రతినిధినే సభ్యునిగా రొటేషన్ పద్ధతిలో నామినేట్ చేస్తారు.

రాష్ట్రప్రభుత్వాల తరపున ఐదుగురికే ప్రాతినిధ్యం దక్కుతుంది. చట్టం అమలుకు సర్వాధికారాలు ఈ కమిటీకే ఉంటాయి. విత్తనఉత్పత్తి, ప్రణాళిక, ఎగుమతులు, దిగుమతులు, రిజిస్ట్రేషన్ ప్రమాణాలు, ధృవీకరణ, విత్తనపరీక్షలు, నిఘా తదితర అంశాలపై ప్రభుత్వాలకు ఈ కమిటీ సూచనలు చేస్తుంది.

రాష్ట్రస్థాయిలోనూ కమిటీని ప్రతిపాదించినా, దానికి పరిమితమైన, అప్రాధాన్య అధికారాలే ఇచ్చారు. ఈ చట్టంలో విత్తననియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు కల్పించి  కేంద్ర కమిటీ అధికారాలను పరిమితం చేయాలి. రాష్ట్ర స్థాయిలో విత్తన నమోదు కమిటీ ఏర్పాటు చేసి దానికి నమోదు రద్దు అధికారం కూడా ఇవ్వాలి. ధరల నియంత్రణ, నష్టపరిహారం బాధ్యతలు కూడా ఈ కమిటికే ఉండాలి.

2019 విత్తనచట్టం ముసాయిదా చట్టంగా మారితే విత్తనంపై పెత్తనమంతా కేంద్రం ఆధీనంలోకి అటునుంచి బహుళజాతి కంపెనీల ఆధిపత్యంలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

**రైతుల ప్రస్తావన**

విత్తనచట్టంలో విత్తనం ఉత్పత్తి చేసే రైతునే విస్మరించారు. ఈ ముసాయిదా ప్రకారం, విత్తన ఉత్పత్తిదారులు, కంపెనీలు, సంస్థలు విత్తనరకాలను విధిగా కేంద్ర, రాష్ట్ర రిజిస్ట్రేషన్ కమిటీల్లో నమోదు చేయించుకోవాలి. సెక్షన్2(16)లో 'ప్రొడ్యూసర్' అంటే ఒక వ్యక్తి, లేదా కొందరు వ్యక్తులు, లేదా సంస్థలు లేదా కంపెనీలుగా నిర్వచించారు. 'రైతు' కాదు అని స్పష్టంగా పేర్కొన్నారు. విత్తనాలు వ్యవసాయ క్షేత్రంలోనే ఉత్పత్తి అవుతాయని, ఫ్యాక్టరీలో కాదన్న విషయం ఈ ముసాయిదా విస్మరించింది.

**నష్టపరిహారం**

నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోతున్న ఉదంతాలు కోకొల్లలు. కానీ, 2019 విత్తనచట్టం ముసాయిదాలో నష్టపరిహారం అందించే వ్యవస్థ ఏర్పాటుపై ఉన్న ప్రస్తావన వివరంగా లేదు. ఇదివరకు రైతులు వినియోగదారుల ఫోరమ్ ద్వారా పరిహారాన్ని పొందాలన్నారు. నష్టపోయిన ప్రతిరైతూ కోర్టుకు వెళ్లడం అసాధ్యం.

నిజానికి, పరిహారం కోసం ఓ కాంపెన్సేషన్ కమిటీ/ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫారసు చేసింది. నకిలీ విత్తనవిక్రేతలను నియంత్రించాలంటే కనీసం 2 నుంచి 10 లక్షల దాకా జరిమానా, మూడునెలల నుంచి ఏడాది జైలుశిక్ష విధించాలని సిఫారసు చేసింది. వీటిని 2019 విత్తనచట్టం ముసాయిదా విస్మరించింది. నకిలీ విత్తనాలు విక్రయించిన బాధ్యులకు రూ.25 వేల నుంచి రూ.1 లక్ష వరకు జరిమానా విధించాలని తాజా బిల్లులో పేర్కొన్నారు.

**విత్తనాల ధరలపై నియంత్రణ**

పత్తి విత్తనాలు ఉత్పత్తి చేసే రైతులు, విత్తనక్షేత్రాల్లో పనిచేసే కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పత్తి విత్తనాల ధరలు నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బీటీ విత్తనాల ధరలను తగ్గించడంలో సుప్రీంకోర్టులో సైతం పోరాడి విజయం సాధించిన నేపథ్యం గత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వానికి ఉన్నది.

గతంలో విత్తనాల ధరలను నియంత్రించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేసింది. అప్పటి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి దేశీయ మార్కెట్‌లోకి విదేశీ కంపెనీలు వచ్చాయి కాబట్టి విత్తనాల అమ్మకాల ధరలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఎవరైనా వర్తకుడు లోపాలున్న విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా చట్టం (ఆరు నెలల నుంచి సంవత్సరం వరకు కారాగార శిక్షను, జరిమానాను విధించాలి) చేయాలని, అంతర్జాతీయ కంపెనీలు తమ ఉత్పత్తులను దేశంలోకి అనుమతించే ముందు వాటిని వ్యవసాయ విశ్వవిద్యాలయం వారిచే పరీక్షలు జరిపించాలని కూడా ఆయన కోరారు.

## రైతుల హక్కులు

ఇదివరకు కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన 'విత్తనచట్టం' పై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. అప్పట్లో 2010లో అన్ని పార్టీలకు చెందిన వారు కూడా ప్రతిపాదిత చట్టంలోని కొన్ని నిబంధనలను మార్చాలని కోరారు. మాన్‌శాంటో వంటి బహుళజాతి విత్తనసంస్థల కొమ్ము కాసే విధంగా రైతులహక్కులను హరించే విధంగా ఈ చట్టం ఉందని వారి ఆరోపణ. ఈ చట్టం అమలులోకి వస్తే రైతులకు తీవ్ర ఇబ్బందులు తప్పవని, విత్తనాల ధరలను అదుపు చేయడం కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉండదని, బహుళ జాతి సంస్థలు గుత్తాధిపత్యాన్ని చలాయించే అవకాశం ఉంటుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 2019 విత్తనచట్టం ముసాయిదాలో అనేక మార్పులు చేర్పులు చేయాల్సి ఉంది. ఇదివరకు విత్తనబిల్లు-2010 పై అధ్యయనం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికారులు, నిపుణులతో కూడిన నలుగురి కమిటీని నియమించింది. ఈ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ బిల్లులో మార్పులు చేర్పులు చేసేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ప్రధానికి, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి లేఖలు పంపారు. ఈ అంశాన్ని లోక్‌సభ సభ్యులతో కూడా చర్చించారు.

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులో చేయాల్సిన మార్పులు, చేర్పులను అప్పటి రాష్ట్రప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకువచ్చింది. రైతుల సంక్షేమం కోసం విత్తనాల ధరలను, సరఫరాను నియంత్రించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉండాలని సూచించారు.

క్లాజ్20(2)లో సంబంధిత రాష్ట్రప్రభుత్వాన్ని చేర్చాలంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. అంతకు  ముందు 2019 విత్తనచట్టం ముసాయిదాలో కూడా నష్టపరిహారం చెల్లించే అంశంపై కేంద్ర ప్రభుత్వం నియమించే కమిటీకి మాత్రమే అధికారం ఉంటుంది. అయితే స్థానిక సమస్యలను, వాతావరణ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వమే నష్టపరిహారం ఎంత ఇవ్వాలో నిర్ణయించేందుకు అవకాశం ఉండాలి.

అప్పట్లో రూపొందించిన క్లాజ్21(6) ప్రకారం విత్తనోత్పత్తిదారులు తమ రిటర్న్స్ విత్తన ధృవీకృత (సీడ్ సర్టిఫికేషన్) ఏజన్సీకి సమర్పించాలంటూ పేర్కొన్నారు. అయితే సీడ్ సర్టిఫికేషన్ ఏజన్సీలలో తగినంత సిబ్బంది లేని కారణంగా ఈ అధికారం 'రాష్ట్ర వ్యవసాయశాఖ'కు అప్పగించే విధంగా మార్పులు చేయాలని కోరడం జరిగింది. దానిని ఆమోదించి, 2019 విత్తనచట్టం ముసాయిదాలో తగు మార్పులు చేశారు. బహుళ జాతి కంపెనీలు విత్తనాలపై చేసే పరిశోధనలలో జవాబుదారీతనం లేకపోవడం వల్ల, ఐసిఎఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రీసర్చ్) లేదా వ్యవసాయ విశ్వవిద్యాలయాల నేతృత్వంలోనే పరిశోధన జరిపేలా బిల్లులో మార్పులు చేయాలని సూచించడమైనది. విత్తన కంపెనీలు సరఫరా చేసే విత్తనాలు నాణ్యతలేనివి అయితే వాటిని వేసిన రైతులు తీవ్రంగా

నష్టపోతారు. ఇలాంటి సందర్భాలలో జరిమానా చెల్లించే విధంగా బిల్లును రూపొందించారు. ఇందులో మార్పులు చేస్తూ భారీ జరిమానాతో కనీసం ఆరునెలలకు తగ్గకుండా ఒక సంవత్సరం వరకు జైలుశిక్ష కూడా వేసేందుకు అవకాశం ఉండేలా క్లాజ్ 38 (2), (3) లో మార్పులు చేయాలని కోరడమైనది.

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త విత్తనబిల్లు (విత్తనచట్టం-2010) యధాతథంగా అమలులోకి వస్తే దేశంలోని రైతులు తమ హక్కులను పూర్తిగా కోల్పోతారు. వ్యవసాయరంగానికి, వ్యవసాయాభివృద్ధికి ఈ విధానం గొడ్డలిపెట్టులా మారుతుందనడంలో సందేహం లేదు. తరతరాలుగా రైతులు విత్తనాలను తయారు చేసుకునేందుకు, విక్రయించుకునేందుకు, పరస్పరం మార్పిడి చేసుకునేందుకు అధికారం, హక్కు కలిగి ఉన్నారు. కొత్త విత్తనచట్టం వల్ల రైతు ఈ అధికారం కోల్పోతాడు. ఇది విపరీత పరిణామాలకు దారి తీస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

'విత్తనగ్రామం' పేరుతో ప్రభుత్వాలు ప్రత్యేక పథకం రూపొందించి అమలు చేస్తున్నాయి. అంటే రైతులు స్వయంగా విత్తనం తయారు చేసుకుని తోటి రైతులకు అందించేందుకు ఇప్పుడు అవకాశం ఉంది. అయితే కొత్త విత్తనచట్టం వల్ల ఈ అవకాశం, ఈ అధికారం, ఈ హక్కు పోతుంది. తరతరాలుగా రైతులు కలిగి ఉన్న ఈ హక్కు కోల్పోయేలా చట్టం రూపొందించడం సరైన విధానం కాదు. ఈ అంశంపై సమగ్రంగా అధ్యయనం చేసి ప్రతిపాదించిన బిల్లులో మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2019 విత్తనచట్టం ముసాయిదాలో క్లాజ్-21 ప్రకారం నకిలీ విత్తనాలు, నాణ్యతలేని విత్తనాలను సరఫరా చేసే కంపెనీలను నష్టపరిహారం కోరడానికి అనేక చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది.

విత్తనకంపెనీలు సరఫరా చేసే విత్తనం నాసిరకానిది అయితే వాటిని ఉపయోగించే రైతులు నష్టపోతే ప్రస్తుతం జిల్లా స్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ పరిహారం కోరేందుకు వీలుంది. 2019 విత్తనచట్టం ముసాయిదా వల్ల ఈ అవకాశం పోతుంది. ఢిల్లీస్థాయిలో ఏర్పడే కమిటీ వద్దకు రైతులు పరిహారం కోసం వెళ్లాల్సి ఉంటుంది. మన దేశంలో దాదాపు 80 శాతం చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. వీరు తమకు లభించాల్సిన కొద్దిపాటి నష్టపరిహారం కోసం ఢిల్లీకి వెళ్లగలరా? వెళ్లలేరు కదా! దాంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారుతుంది. రైతులకు నష్టపరిహారం అందించాలంటే, గ్రామస్థాయి లేదా జిల్లాస్థాయి నష్టపరిహార కమిటీలు ఏర్పాటు చేయాలి. సత్వరమే, ఒక నెల లోపల నష్టపరిహారం అందే విధంగా నిబంధనను రూపొందించాలి.

అలాగే నకిలీ విత్తనాలను, నాణ్యత లేని విత్తనాలను సరఫరా చేసే బహుళజాతి సంస్థలను కఠినంగా శిక్షించే అవకాశం కొత్త చట్టప్రకారం ప్రభుత్వానికి లేదు. ప్రతిపాదించిన శిక్షలు వారికి కేవలం చాక్‌లెట్లు, బిస్కెట్లు కొన్నట్టు కూడా కాదు. ఈ కారణంగానే తప్పు చేసిన

విత్తన కంపెనీలను కఠినంగా శిక్షించే విధంగా చట్టం రూపొందించాలి. విత్తనకంపెనీలపై జరిమానా విధించడంతో పాటు జైలుశిక్ష కూడా వేసే విధంగా చట్టాన్ని రూపొందించాలి. విత్తనాల ధరల నియంత్రణ రాష్ట్రాల పరిధిలోనే ఉండాలి. పంటలలో ఒక రాష్ట్రానికి, మరో రాష్ట్రానికి తేడా ఉంటుంది. ఒక ప్రాంతంలో ఒక రకమైన విత్తనాలకు డిమాండ్ ఉండగా, మరో రాష్ట్రంలో ఇంకోరకమైన విత్తనాలకు డిమాండ్ ఉంటుంది. ఈ కారణంగానే విత్తనకంపెనీలను నియంత్రించే అధికారం తప్పనిసరిగా రాష్ట్రప్రభుత్వాలకే ఉండే విధంగా కొత్త విత్తనచట్టంలో మార్పులు, చేర్పులు చేయాలి.

దేశంలో వ్యవసాయరంగాన్ని ఒక పరిశ్రమగా, చిన్న రైతులను దివాలా తీయించేందుకే కొత్త విత్తనచట్టాన్ని తీసుకువస్తున్నారు అని శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. కొత్త విత్తనబిల్లులో బహుళ జాతి విత్తనకంపెనీలకు లాభం చేకూర్చేవిధంగా నియమ, నిబంధనలు ఉన్నాయి తప్ప, రైతుకు ప్రయోజనం కలిగించే విధంగా లేవు.

విత్తనచట్టాన్ని రూపొందించే బిల్లును (విత్తనచట్టం–2010) పార్లమెంట్‌లో చర్చకు తీసుకునే ముందు ముసాయిదా బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి అప్పగించారు. ముసాయిదా బిల్లును క్షుణ్ణంగా పరిశీలించిన ఈ కమిటీ కొన్ని కీలక సిఫార్సులు చేసింది. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు, బహుళ దేశ కంపెనీల ఆగడాలను అరికట్టేందుకు, రాష్ట్రాలకు సేద్యరంగంలో అధికారాలు ఉండేందుకు, బహుళ జాతి కంపెనీల విత్తనాలను తమ చేలల్లో వేసిన సమయాల్లో పంటలు నష్టపోతే పరిహారం ఇప్పించేందుకు అనేక సిఫార్సులను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను నిర్లక్ష్యం చేసి కొత్త విత్తనచట్టం తీసుకువచ్చారు. వాస్తవానికి ఇది ఆత్మహత్యా సదృశమే.

బీటీ–1 పత్తి విత్తనాలను రైతులు స్వాగతించారు. వీటిలో జన్యుమార్పిడి కోసం ఉపయోగించిన క్రై–1ఎసి జన్యువునే హైబ్రిడ్ వంకాయలో ప్రవేశపెట్టి బీటీ వంకాయను అమెరికాకు చెందిన మోన్‌శాంటో కంపెనీ రూపొందించింది. తొలుత బీటీ వంకాయను భారతదేశంలోనే ప్రవేశపెట్టారు. సమగ్ర పరిశోధన చేయకుండానే ఈ నిర్ణయం తీసుకున్నారు. జన్యుమార్పిడి వల్ల ఉత్పత్తి అయ్యే వంకాయ మనుషుల ఆరోగ్యానికి హానికరమని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. దాంతో పర్యావరణ పరిరక్షణ పేరుతో బీటీ–వంకాయను వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసేందుకు జిఇఎసి ఇచ్చిన అనుమతిని కేంద్ర పర్యావరణశాఖ మంత్రి తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే ఈ నిర్ణయం అనేక అధికారులకు, స్వార్థపరులకు రుచించలేదు. కంపెనీల ఒత్తిడి మేరకు కొత్త విత్తనబిల్లును హడావుడిగా పార్లమెంట్లో పెట్టి చట్టంగా మార్చే ప్రయత్నం చేశారు. అప్పట్లో, ఆంధ్రప్రదేశ్ నుంచి అన్ని రాజకీయ పక్షాలు కదిలి 2010 విత్తన చట్టం ముసాయిదాను నిలువరించాయి. ఈ కారణంగానే 2019 విత్తన ముసాయిదా రాజ్యసభ ఆమోదించినట్టు యధాతథంగా కాకుండా, రైతులు, రైతు సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద

సేవాసంస్థలు తదితరులు చేసిన సూచనలకు అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు. అయినా రైతు ప్రయోజనాలు కాపాడే విధంగా ఈ ముసాయిదా లేదు.

విత్తనచట్టం రూపొందించడంలో అదృశ్యపెత్తనం సాగుతోంది. బహుళ జాతి సంస్థలు (మల్టీనేషనల్ కంపెనీలు–ఎంఎన్‌సిలు) పరోక్షంగా విత్తనచట్టం రూపొందించడంలో తమ శక్తిని చూపించాయనడంలో సందేహం లేదు. వ్యవసాయం రాష్ట్రపరిధిలోని అంశం కావడం వల్ల విత్తనాల ధరలను నియంత్రించడంలో, నిర్ణయించడంలో రాష్ట్రాలకే అధికారం ఉండాలి. అయితే కొత్త విత్తన చట్టం వల్ల విత్తనాల ధరలను నిర్ణయించడంలో రాష్ట్రాలకు ఇక నుండి ఎలాంటి హక్కు, అధికారం ఉండబోదు. దీనివల్ల వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉంది. కొత్త విత్తనచట్టం అమలులోకి వస్తే ఆధునిక సాంకేతికవిజ్ఞానం పేరుతో ఎంఎన్‌సిలు విత్తనాల ధరలను అత్యధిక ధరలకు విక్రయించే అవకాశం ఉంది. ఇంతకు ముందు పత్తి విత్తనంలో క్రై–1ఎసి జన్యువును హైబ్రిడ్ పత్తిలో ప్రవేశపెట్టినప్పుడు దేశవ్యాప్తంగా బీటీ–1 (బిజి–1) పత్తి విత్తనాలను 450 గ్రాములకు 1850 రూపాయలకు విక్రయించిన విషయం ఈ సందర్భంగా గమనించాలి. రైతుసంఘాలు ఈ అంశంపై మోనోపలీ అండ్ రిస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టీసెస్ (ఎంఆర్‌టిపి) లో ఫిర్యాదు చేశాయి. ఈ అవకాశాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినియోగించుకుని 2005–06 సంవత్సరంలోనే బీటీ–1 (బిజి–1) పత్తి విత్తనాల ధరలను ఒక్కో ప్యాకెట్టుకు 650 రూపాయలకు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీసుకుని ఇదే విధానాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలన్నీ అమలు చేశాయి.

ఈ పరిస్థితిలో 2019 విత్తన చట్టం అమలులోకి వస్తే విత్తనాల ధరల నిర్ణయంపై ఎంఎన్‌సిల పెత్తనమే కొనసాగుతుంది. రాష్ట్రప్రభుత్వాలకు ఎలాంటి అధికారం ఉండబోదు. ఈ విధానం భారత రైతాంగాన్ని ఆర్థికంగా పూర్తిగా దివాలా తీయించే విధంగా తయారవుతుంది. ఎంఎన్‌సిలు విధించే రాయల్టీపై ప్రభుత్వానికి నియంత్రణ పోతుంది. అవి అందించే ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అడ్డుపెట్టుకుని పెత్తనం కొనసాగిస్తాయనడంలో సందేహం లేదు. విత్తనాల ఉత్పత్తి, విక్రయాలపై లైసెన్సింగ్ విధానం ఉండాలి. లైసెన్సింగ్ ఇచ్చే సమయంలోనే నాణ్యత కలిగిన విత్తనాలను మాత్రమే రైతులకు అందించే విధంగా ప్రభుత్వం నిబంధనలను రూపొందించి, వాటిని కంపెనీలు పాటించే విధంగా చట్టం ఉండాలి. విత్తనకంపెనీల్లో ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్మెంట్ (ఎఫ్‌డిఐ) 49 శాతం మించకుండా చూడాలి. తద్వారా విదేశీకంపెనీలు మనదేశంపై, మనదేశానికి చెందిన విత్తనోత్పత్తి కంపెనీలపై పెత్తనం చలాయించేందుకు వీలుకాదు. కాని కొత్త విత్తనచట్టం ద్వారా ఎఫ్‌డిఐ 100 శాతం వరకు ఉండేందుకు అనుమతి ఇస్తున్నారు. దాంతో భారతీయ విత్తనకంపెనీలలో ఎక్కువ శాతం మూతపడతాయనడంలో సందేహం లేదు. దేశీయకంపెనీలను విదేశీ సంస్థలే స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. కొత్త విత్తనచట్టం యథాతథంగా అమలులోకి వస్తే

విత్తనకంపెనీలు విక్రయించే విత్తనాలను రైతులు వినియోగించే సందర్భాల్లో అవి మొలకెత్తకున్నా, దిగుబడి సక్రమంగా రాకపోయినా నష్టపరిహారం అందే అవకాశాలు సన్నగిల్లుతాయి. రైతులు ప్రస్తుతం నష్టపరిహారానికి జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి వినియోగదారుల ఫోరంలలో కేసులు నమోదు చేసి పరిహారం పొందుతున్నారు. కొత్త విత్తనచట్టం వల్ల ఈ అవకాశం పోతుంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం మన రైతులకు అనుకూలంగా ఉండే విత్తనచట్టాన్ని తీసుకురావలసి ఉంది.

రాష్ట్ర స్థాయిలో విత్తనకమిటీని ఏర్పాటు చేయాలి. వివిధ కంపెనీలు తమ పేర్లను ఈ కమిటీ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చట్టం రూపొందించాలి. సెంట్రల్ సీడ్ కమిటీ కేవలం రిజిస్ట్రేషన్లను రివ్యూ మాత్రమే చేసేలా నియమావళి ఉండాలి. కంపెనీలు రూపొందించే విత్తనాలను ఈ కమిటీ అనుమతి పొందిన తర్వాతనే విక్రయించేందుకు అవకాశం కల్పించాలి.

ఈ కమిటీ విత్తనాల ధరలను ప్రతి ఏడాది సమీక్షించి రైతులకు అనుగుణమైన ధరలు నిర్ణయించగలిగే విధంగా చట్టాన్ని రూపొందించాల్సి ఉంది. విత్తనాల ధరలను నియంత్రించే విధంగా అధికారాలను ఇవ్వాలి. అలాగే రైతులచేత విత్తనాలను ఉత్పత్తి చేయించే సమయంలో కూడా పెట్టుబడిని, రైతు లాభాన్ని కలిపి నిర్ణయించాలి. ఇందుకోసం ఎంఆర్‌పిని నిర్ణయించగలగాలి. విత్తనాల ధరలను నియంత్రించే అధికారం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు లేకపోతే వీటి ధరలు విపరీతంగా పెరిగి రైతులు ఆర్థికంగా చితికిపోతారు. ప్రస్తుతం, ఇదివరకు, కాయగూరలు, పండ్లు, ఇంకా ఇతర విత్తనాల ధరలు ఎలా పెరిగిపోయాయో ఒక పర్యాయం పరిశీలిస్తే, 2019 విత్తనచట్టం అమలులోకి వచ్చిన తర్వాత వీటి ధరలు ఎలా ఉంటాయో ఊహించవచ్చు.

ఈ కారణంగానే విత్తనధరలను అదుపు చేసే అధికారం రాష్ట్రాలకే ఇవ్వాల్సి ఉంది. నకిలీ, నాణ్యత లేని విత్తనాలను రైతులకు సరఫరా చేసిన సమయంలో పంటల నష్టం జరిగితే తగిన విధంగా నష్టపరిహారం చెల్లించే విధంగా చట్టాన్ని రూపొందించాల్సి ఉంది. పంటల నష్టాన్ని పంచాయితీలు ధృవీకరించే విధంగా ఉండాలి. పరిహారం చెల్లించే విషయంలో నిర్ణీత గడువును నిర్ధారించాలి. జిల్లాస్థాయి నష్టపరిహారం కమిటీని ఏర్పాటు చేసే విధంగా కొత్త బిల్లులో చేర్పులు చేయాలి. విత్తనోత్పత్తి కంపెనీలు నకిలీ, నాణ్యతలేని విత్తనాలను రైతులకు విక్రయిస్తే, అలాంటి కంపెనీలపై అత్యధికంగా పెనాల్టీ వేసే విధంగా చట్టాన్ని రూపొందించాలి. అలాంటి కంపెనీలు భవిష్యత్తులో వ్యాపారం చేసుకోకుండా కఠినచర్యలు తీసుకునేలా చట్టాన్ని రూపొందించాలి. కంపెనీలు వసూలు చేసే రాయల్టీ, ట్రైట్ ఫీజులను సైతం నియంత్రించే అధికారాలు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలి.

రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర జాబితాలోని అంశం. విత్తనం, ఎరువులు, విస్తరణ, పరిశోధనలు లాంటి కీలకమైన వ్యవసాయాభివృద్ధికి తోడ్పడే విషయాలను రాష్ట్ర

ప్రభుత్వాలు నియంత్రించే అధికారం కలిగి ఉండాలి.

**ఈ కింది సవరణలతో 2019 విత్తనచట్టం ముసాయిదా రూపొందించాలి:**

1. విత్తన నిర్వచనం ఆయా దశలను బట్టి ఉండాలి. బ్రీడర్ విత్తనం, ఫౌండేషన్ విత్తనం, సర్టిఫైడ్ విత్తనం తదితర దశలను ఈ ముసాయిదాలో విధిగా ప్రస్తావించాలి.

2. ఆయా విత్తనచట్టాల మధ్య వైరుధ్యం, సారూప్యం, సమతుల్యతలకు సంబంధించిన ప్రస్తావన ఉండాలి.

3. రాష్ట్రస్థాయిలో విత్తన నమోదు కమిటీని ఏర్పాటుచేయాలి. నమోదు చేసిన విత్తనరకం రద్దు చేసే అధికారం కూడా ఈ కమిటీకి ఉండాలి.

4. రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి జిల్లాస్థాయిలో నియంత్రణ కమిటీలు వేయాలి. ప్రక్రియ ఒక నెలలోనే పూర్తి కావాలి. వాటి ద్వారానే కంపెనీల నుంచి నష్టపరిహారం రైతులకు ఇప్పించాలి. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోనే జరగాలి. నష్టపరిహారం చెల్లించని కంపెనీలను తీవ్రంగా శిక్షించాలి.

5. స్థానిక విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు విత్తనాల నాణ్యతను ధ్రువీకరించిన తర్వాతనే వ్యవసాయశాఖ ద్వారా వాటిని విడుదల చేయాలి.

6. కాంట్రాక్టు పద్ధతిలో విత్తనాలు సేకరిస్తున్నారు. ఇటువంటి సందర్భాల్లో ఉత్పత్తి, ఉత్పాదకాలు ఇతర విధానాలను నియంత్రించే అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలి.

7. ప్రభుత్వ నిధులతో పరిశోధనా సంస్థలు రూపొందించిన కొత్త రకాలను నేరుగా రైతులకు అందించే వీలుండాలి. గ్రామీణ విత్తనపథకం, మినీ కిట్స్ ప్రోగ్రామ్ ద్వారా రైతులకు అందించే ఏర్పాటు చేయాలి.

8. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, వివిధ పంటలు, రకాలు స్థానిక స్వభావం కలిగి ఉంటాయి. కాబట్టి వాటిని పరీక్షించే అధికారం రాష్ట్ర ప్రభుత్వసంస్థలకే ఉండాలి.

9. విత్తనాల కంపెనీల్లో ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌డిఐ) 49 శాతం మించకుండా చూడాలి.

10. రైతులు సొంత విత్తనాలు వాడుకోవడానికి, సేకరించిన మేలైన విత్తనాలు ఇతర రైతులకు మార్పిడి చేసుకోవడానికి వీలుండాలి.

11. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రప్రభుత్వాలు ఈ విత్తన ముసాయిదా మీద వెలిబుచ్చిన అభిప్రాయాలను బహిరంగపరచాలి. రాష్ట్రస్థాయిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుసంఘాలతో కలిసి ముసాయిదా మీద చర్చించాలి. రాష్ట్రాల పార్లమెంటు సభ్యులందరినీ కూడా ఈ సమావేశానికి ఆహ్వానించి వారిలో అవగాహనను పెంచాలి. రైతు ప్రయోజనాల పట్ల వారి నుంచి మాట తీసుకోవాలి.

★★★

# విత్తనాలకూ ఒక సుస్థిర విధానం ఉండాలి...



విత్తనాల నుంచే ఆహారఉత్పత్తి మొదలయ్యింది. మన రైతులు వివిధ రకాల పంటలు పండిస్తారు. ప్రతి పంటకు అనేక రకాల విత్తనాలు ఉంటాయి. విత్తనాలు పలు రకాలు. విత్తనాలే ఆహారం. ప్రతి విత్తనానికి ఒక ప్రాశస్త్యం ఉంటుంది. స్థానికంగా లభ్యమయ్యే ప్రత్యేక పర్యావరణ, వాతావరణ, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతి పంటలో రైతులు వందల ఏండ్లుగా విత్తనాలను రూపొందిస్తున్నారు. మన దేశ వరిలో దాదాపు 3 లక్షల దేశీరకం విత్తనాలు ఉండేవని వ్యవసాయ చరిత్ర చెబుతున్నది. అనేక పంటలకు వివిధ రకాల విత్తనాలను వందల యేండ్ల నుంచి వృద్ధి చేసుకున్న ఘనత భారత సాంప్రదాయ వ్యవసాయానిది. దేశవ్యాప్తంగా విత్తనాల చుట్టూ అనేక సంప్రదాయాలు, పండుగలు, గ్రామీణ కార్యక్రమాలు ఉండేవి. అనేక చోట్ల ఇప్పటికీ అవి జరుపుకుంటున్నారు. గ్రామీణులు, రైతులు, ప్రత్యేకంగా మహిళలు విత్తనాలను గుర్తించడంలో, నిల్వ చేయడంలో, శుద్ధి చేయడంలో గణనీయ జ్ఞానం, కౌశల్యం సంపాదించారు. రకరకాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విత్తనాలను రూపొందించారు మన గ్రామీణులు. వేల సంవత్సరాలకు పైగా, తరతరాలుగా రైతాంగం పరిశోధనల ఫలితంగా అనేక రకాల విత్తనాలు స్థానిక భౌగోళిక, జీవావరణ పరిస్థితులు, మానవ అవసరాలకు అనుగుణంగా వృద్ధి చేయబడ్డాయి. ఈ జానపద విత్తన రకాలు మానవాళికి సుమారు 2,500 పంటలు, 14 పశువులకు సంబంధించిన ఆశ్చర్యపరిచే స్థాయిలో 11.4 లక్షల రకాలు, 8,800 పశువుల జాతులను అందించింది.

హరిత విప్లవం ఒక ప్రభుత్వ విధానంగా వచ్చిన గత 60 ఏళ్లల్లో అనేక రకాల హైబ్రిడ్ విత్తనాలు ప్రధానంగా వరి, గోధుమలు, మక్కలలో ప్రవేశపెట్టారు. 1968–2019 మధ్య వివిధ సంస్థల ద్వారా 1200 వరి హైబ్రిడ్లను ప్రవేశ పెట్టింది ప్రభుత్వం. ఏకపంట పద్ధతికి ప్రభుత్వం ప్రోత్సహించడంతో, హైబ్రిడ్ విత్తనాల వల్ల, విత్తనాల ప్రైవేటీకరణ, లాభాల కొరకు పరిశోధన ల్యాబ్ లకే పరిమితం అవడం వల్ల పంటల వైవిధ్యం, విత్తనాలలో వైవిధ్యం క్రమంగా తగ్గుతూ వస్తున్నది. ఇది ప్రమాదకర స్థాయికి చేరింది. హైబ్రిడ్ విత్తనాలు ప్రతి 3 నుంచి 4 ఏండ్లకు మార్చాల్సి వస్తుంది. ఆధునిక వ్యవసాయం ల్యాబ్ విత్తనాలను ప్రవేశపెట్టి,

సంప్రదాయ విత్తనాలను కనుమరుగు చేస్తున్నది. రైతులలో విత్తనాల మీద జ్ఞానం, నైపుణ్యం క్రమంగా కనుమరుగవుతున్నది. ఒక పంటలో వేరు వేరు విత్తనాలను గుర్తించలేని స్థితిలో చాలా మంది రైతులు ఉన్నారంటే పరిస్థితి ఏ మేరకు దిగజారిందో ప్రత్యక్షంగా గమనించవచ్చు.

**వ్యాపార విత్తనాలు**

విత్తనాలు కంపెనీల గుప్పిట్లో అనేక విధాలుగా మారుతున్నాయంటే మొత్తం ఆహార వ్యవస్థ కూడా ఈ కంపెనీల చేతులలోకి వెళ్లిపోతాయి. అట్లని కంపెనీల అధీనంలో వ్యాపారరీత్యా ఒక గొప్ప విత్తనవ్యవస్థ వచ్చిందా అంటే అదీ లేదు. రసాయనాలు వాడి తయారు చేసిన విత్తనాలు రసాయన వ్యవసాయంలోనే పని చేస్తాయి. సహజంగా విత్తనాలలో సహజీవన సూక్ష్మజీవులు ఉంటాయి. విత్తనం మొలకెత్తినప్పుడు అవి తక్షణమే మూలవ్యవస్థలు, ఆకుల ఉపరితలంపైకి చేరుతాయి. రసాయన చర్యకు లోనైన ఆధునిక విత్తనాలలో ఈ సూక్ష్మజీవులు ఉండవు. నేల సారం బట్టి ఇవి వృద్ధి చెందుతాయి. వృద్ధి చెందడానికి కనీసం 2 వారాలు పడుతుంది. అయితే ఈ కీలక సమయం అనేక వ్యాధుల వ్యాప్తికి అవకాశంగా మారుతుంది. విత్తనాలు అంటే జీవం. జీవ ప్రక్రియలో విత్తనాలు ముఖ్యమైనవి. ప్రస్తుతం అవి విషానికి, విష వ్యాపార సంస్కృతికి బలి అవుతున్నాయి. ఫలితంగా మానవాళి ఆహార భద్రత ప్రమాదంలో పడుతున్నది. కంపెనీలు 3 ఏళ్ల విత్తననిల్వ పెట్టుకుంటాయి. నిల్వ ఉండడానికి పురుగులు, చీడ పీడ పట్టకుండా విత్తనాలను రసాయనాలతో కడిగి, రసాయనాల పూత పూస్తారు. ప్రైవేటు కంపెనీల విత్తనవ్యాపారం మన దేశంలో 2002 నుంచి పుంజుకున్నది. ప్రతి ఏడు పెరుగుతున్నది. దాదాపు రూ. 25 వేల కోట్ల రూపాయల వార్షిక టర్న్‌ఓవరుకు ఇది చేరింది. ప్రపంచ వ్యాప్తంగా 75 శాతం విత్తన వ్యాపారం కేవలం 3 బహుళజాతి కంపెనీల గుత్తాధిపత్యంలో ఉన్నది. అమెరికా దేశంలోనే పారిశ్రామిక వ్యవసాయానికి అనుగుణమైన విత్తనవ్యవస్థ పుట్టుకొచ్చింది. అమెరికా ప్రభుత్వం ఎల్లప్పుడూ ఈ కంపెనీలకు మద్దతుగా తన వాణిజ్య, విదేశాంగ విధానం అమలు చేస్తుంది. మనదేశంలో కూడా 15 ఏళ్ల క్రిందట ఉన్న కంపెనీల సంఖ్య నానాటికీ తగ్గిపోతున్నాయి. కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం పెరుగుతున్నది. మార్కెట్ లో పోటీ తగ్గి కొన్ని కంపెనీల ఆధిపత్యంలో మార్కెట్లు ఉండడం వ్యవసాయ సుస్థిరతకు శ్రేయస్కరం కాదు. బీటీ పత్తి మినహా వేరే రకం పత్తి మార్కెట్ లో లేకుండా ఈ ప్రైవేటు కంపెనీలు సిండికేట్ అయినాయి. ప్రభుత్వసంస్థలలో విత్తన పరిశోధనలు జరుగకుండా ప్రైవేటు విత్తనవ్యాపారం అడ్డు పడుతున్నది.

**విత్తన నియంత్రణ**

అధిక దిగుబడి వంగడాలు, హైబ్రిడ్ విత్తనాలు ప్రవేశపెట్టిన నేపథ్యంలో విత్తనచట్టం

1968లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రాథమిక లక్ష్యం అప్పట్లో ప్రభుత్వ పరిశోధన సంస్థలు విత్తనాలను విడుదల చేసే పద్దతిని నిర్దేశించిడం. తరువాత 2002లో ప్రైవేట్ కంపెనీలకు విత్తనాలను ప్రవేశపెట్టే అవకాశం ఇచ్చిన తర్వాత విత్తనచట్టం సవరించాలని భావించారు. 2003 నుంచి కొత్త విత్తనచట్టం రైతాంగం కోరుతున్నా అది కార్యరూపం దాల్చలేదు. కంపెనీలకు అనుకూల ముసాయిదాలతో 20 ఏళ్ల కాలం దాటింది. కొన్ని రాష్ట్రాలు తమ పరిధిలో చట్టం తీసుకువచ్చే ప్రయత్నం చేసాయి. కానీ అవి సఫలీకృతం కాలేదు..

గత 18 సంవత్సరాలలో ప్రైవేటు విత్తనరంగం రూ.5 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు పెరిగింది. నియంత్రణ లేకుండా, చట్టం లేని 'అభివృద్ధి' పథంలో ప్రైవేటు విత్తన రంగం అభివృద్ధి చెందుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. నాణ్యత లేని విత్తనాలతో, నియంత్రణ లేని ధరలతో రైతులు నష్టపోతుంటే, వారి బలహీనతల మీద నిర్మితమవుతున్న ప్రైవేటు విత్తనరంగం ఆర్థిక, రాజకీయ బలం పుంజుకుంటున్నది. ప్రభుత్వ సంస్థల నుంచి మూల విత్తనాలు తీసుకుని విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు అమ్ముకుని లాభాలు గడించే ప్రైవేటు కంపెనీలు ఇప్పుడు కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయి. వ్యవసాయానికి విత్తన ఆవశ్యకత ఉన్నందున విత్తనాలను నిత్యావసర చట్టంలో చేర్చిన ప్రభుత్వం ప్రైవేటు విత్తన కంపెనీలకు ఆదాయపుపన్ను నుంచి చట్టం మినహాయింపు ఇచ్చింది. విత్తనధరల మీద నియంత్రణ లేదు. మొక్కుబడిగా ప్రతి సంవత్సరం ప్రత్తి విత్తనాల ధర నిర్ణయిస్తారు. కొరత ఉందని రైతులను భయపెట్టి బ్లాకు మార్కెట్లో వాటి ధర పదింతలు పెంచుతారు. రైతు మీద భారం మోపుతారు. విత్తనరైతులకు గిట్టుబాటు ధర ఇవ్వరు. అనేక సాకులు చెప్పి ఒప్పుకున్న ధర అసలు ఇవ్వనే ఇవ్వరు. రైతు పండించిన విత్తనం రైతులకు అమ్మి కోట్లు గడిస్తున్న కంపెనీలు రైతులకు న్యాయం చేయడం లేదు. రైతులకు నాణ్యత లేని విత్తనాలు అమ్ముతున్న కంపెనీల మీద, వ్యక్తుల మీద చర్యలు లేవు. కొంత మంది రాజకీయనాయకుల అండతో ఈ



కంపెనీలు ఇష్టానుసారం వ్యాపారం చేస్తున్నా శాస్త్రవేత్తలు, పరిశోధన సంస్థలు, ప్రభుత్వ అధికారులు కిమ్మనడం లేదు. ప్రత్తి విత్తనాలలో దాదాపు 1800 బీటీ హైబ్రిడ్లు ప్రవేశపెట్టినా, ఏ ఒక్క హైబ్రిడ్ మీద పరిశోధించి, వాటి పనితీరు (Performance) మీద సమాచారం రైతులకు తెలుపాలనే సోయి,

భాద్యత ఎవరికీ లేకుండా పోయింది. ఎవరైనా రైతు సొంతంగా విత్తనాలు అమ్మితే వారి మీద 420 కేసులు పెట్టె శాసనవ్యవస్థ నాణ్యత లేని విత్తనాల వల్ల వేల ఎకరాల పంట నష్టపోయినా ఆయా కంపెనీలకు తాఖీదులు ఇచ్చే ధైర్యం కూడా చేసే స్థితిలో లేదు.

విత్తనాల స్వచ్ఛత (Purity) కాపాడే బాధ్యతను ఏ ప్రభుత్వసంస్థ తీసుకోవడం లేదు. స్వచ్ఛమైన విత్తనాలను రైతులకు అందజేసే వ్యవస్థ కూడా లేదు. రైతులే ఎంచుకుని, దాచుకుని, పంచుకుని, ఉపయోగించే వ్యవస్థ కనుమరుగవుతున్నది. జన్యుమార్పిడి విత్తనాల వల్ల శ్రేష్టమైన సంప్రదాయ విత్తనాలు కనుమరుగవుతుంటే, కలుషితం అవుతుంటే పట్టించుకుని సంరక్షించే విత్తనసంస్థ లేకపోవడం నిజంగా దురదృష్టకరం. ప్రత్తి విత్తనాలలో శ్రేష్టమైన, సంప్రదాయ, దేశీవిత్తనాలు ఇప్పుడు దొరికే పరిస్థితి కూడా లేదు. అనేక పంటలలో ఇదే పరిస్థితి. పసుపు, చెరుకు, గోధుమలు, జొన్నలు, మక్కలు, కూరగాయలలో దేశీరకాలు కనుమరుగవుతున్నాయి. ప్రైవేటు కంపెనీలు అమ్ముతున్న కంకర లాంటి మక్క గింజల పంట ఫ్యాక్టరీకి పంపించి ప్రాసెస్ చేసి, పశువులు, కోళ్ల దాణాగా మాత్రమే ఉపయోగించేందుకు వృద్ధి చేశాయి. ఇప్పటి మక్క కంకులు నేరుగా ఇండ్లల్లో ఒలిచి, కాల్చుకుని లేదా ఉడకపెట్టుకుని తినే విధంగా లేవు. ఆ మక్కలు పండించి కంపెనీలకు అమ్ముకోవడం తప్పితే వేరే మార్గం లేదు. అమెరికాలో 90 శాతం పైగా ఇటువంటి మక్క పంటనే పండిస్తారు. ఈ మక్కలను ఎగుమతి చేయడం, అటువంటి మక్క గింజలు పక్కాగా వాడమని, తమ కంపెనీల దగ్గర కొనుక్కోమని వివిధ దేశాల మీద ఒత్తిడి తేవడం అమెరికా ప్రభుత్వం చేసే పని.

ఇటీవల అటువంటి జన్యుమార్పిడి మక్కలు మాకు వద్దని మెక్సికో ప్రభుత్వం అమెరికా మక్కల దిగుమతిని ఆపేసింది. మక్కలకు మక్కాగా ప్రసిద్ధి చెందిన మెక్సికో తమ గింజలను, తమ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అమెరికాను ధిక్కరించింది. వరిగింజలకు, వైవిధ్యానికి ప్రసిద్ధి చెందిన మనదేశం మాత్రం విత్తన వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు ఒక్కడుగు కూడా వేయడం లేదు. పైగా ప్రతి విదేశీ కంపెనీ వాడు వచ్చి భ్రమలు కల్పించే సదస్సులు పెడితే వాటికి మన ప్రజా నిధులు వెచ్చించి మరీ చెప్పించుకుంటారు మన పాలకులు. బానిసతత్వం మనలో ఇంకా పోలేదు అనడానికి ఇది ఒక నిదర్శనం.

**ప్రైవేటు వద్దు**


రైతులే కేంద్రంగా విత్తన వ్యవస్థను పునరుద్ధరించే పనిని అనేక స్వచ్ఛంద సంస్థలు దేశ వ్యాప్తంగా చేస్తున్నాయి. సహకార విత్తన బ్యాంకులు (Community seed bank) ఏర్పాటు చేసి రైతులు, ప్రత్యేకంగా మహిళలను ప్రోత్సహిస్తున్నాయి. వారిలో పరిశోధనాత్మక గుణం ఉన్న రైతులను ప్రోత్సహిస్తూ దేశీయ వంగడాలను వృద్ధి చేస్తూ, వారి జ్ఞానాన్ని, తృష్ణను వ్యాప్తి చేస్తున్నాయి. గత పదేళ్ళలో వరి, గోధుమలు, చిరుధాన్యాలు, వివిధ కూరగాయల పంటలు

పండించడానికి  మళ్లీ దేశీయ విత్తనాలు ఉపయోగించే పరిస్థితి, వాతావరణం కల్పించటంలో అనేక సంస్థలు, వ్యక్తుల కృషి ఉన్నది. అయితే, మన దేశంలో ఈ రెండు వ్యవస్థల (రైతు కేంద్రీకృత విత్తన వ్యవస్థ, లాభాపేక్షతో కొన్ని జన్యుమార్పిడి విత్తనాలను గుప్పిట్లో పెట్టుకున్న ప్రైవేటు వ్యవస్థ) మధ్య కనపడని సంఘర్షణ ఏర్పడింది. ప్రభుత్వాలు ప్రైవేటు విత్తనవ్యవస్థ వైపు మొగ్గు చూపుతూ, సబ్సిడీలు అందిస్తూ గుత్తాధిపత్యానికి ఊతం ఇస్తున్నాయి. బహుళజాతి విత్తన కంపెనీల మాయాజాలం నుంచి ఇవి బయటకు రావాలి. రైతులకు విత్తనాల మీద స్వావలంబన కొనసాగించే వ్యవస్థ అవసరం ఎంతైనా ఉన్నది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలన్నా, రసాయన రహిత పౌష్టిక ఆహారం అందాలన్నా, అందరికి కూడు, బట్ట అందాలన్నా విత్తన వ్యవస్థ లాభాపేక్షలేని వ్యవస్థగా రూపుదిద్దుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుస్థిర, గుత్తాధిపత్య రహిత విత్తన వ్యవస్థకు ప్రోత్సాహం అందించే విధానాలు రూపొందించాలి.

కొన్ని వేల సంవత్సరాల నుండి రైతులు, పశుపోషకులు అభివృద్ధి చేసిన విత్తనాలు, పశుజాతులలో ఉన్న అద్భుతమైన వైవిధ్యం, వాటితో ముడిపడిన అటవీ సంపద, మానవులందరి వారసత్వం. ఇటీవల అవి ప్రైవేట్ లాభం కోసం, వ్యాపార ప్రయోజనాల కోసం నాశనం చేయబడుతున్నాయి. మానవాళి వీటిని శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం కనపడుతున్నది. ఈ ఉమ్మడి వారసత్వాన్ని కోల్పోకుండా నిరోధించడానికి చాలా ఏళ్ల క్రిందట ఉపయోగించిన ఉమ్మడి ప్రయోజనాలను పెంపొందించే సామాజిక విత్తనాల వ్యవస్థ పట్ల శ్రద్ధ, సారథ్యం, బాధ్యత వహించాల్సిన అవసరం మళ్లీ  ఏర్పడింది. గాలి, నేల, నీరు వంటివి సహజ పర్యావరణ వనరులు. విత్తనాలు కూడా ఒక సహజ వనరే. అది ఏ ఒక్కరి సొంతం కారాదు.

★★★

## SEED PROBLEM UNSOLVED IN INDIA



Last year it was worse than the previous year. Even that previous year was worse than the year before. Every year, farmers are facing an increasing problem of access to seeds. Standing in long queues, with cash in hand (procured from private money lenders with great difficulty and high rate of interest), and anxiety writ on their faces, farmers do not know if this method of seed procurement is likely to be permanent or a temporary phenomena. Every year, they hope that the situation might change. Problems with seeds are deep rooted, and extending these roots into new areas. It is not just availability of seeds on time. It is also not just about quality of seeds. Good quality seeds, with good germination potential, are becoming rare, as the number of hybrids are increasing. On the other hand, prices of seeds are increasing every year. So much so, farmers are now shelling out 10-30 percent of per acre investment on seeds alone, starting from zero. Yet, they are not assured of good quality seeds.

There are administrative, economic, management and legal issues here. However, farmers who are forever busy with farming do not have information, knowledge or wherewithal on how to deal with these issues. The traditional systems of selection, saving, improving and production of seeds have been deliberately replaced by the governments.

**Seed shortage?**

The big question is seed shortage for real? A national report on requirement and availability of seeds for kharif plan 2013-14 cites

surplus availability in all seeds, including major crops such as paddy and cotton. This report which mentions 31 crops, availability of 1.54 crore quintals of seeds, against a requirement of 1.40 crore quintals, declares a surplus of 14 lakh quintals for kharif 2013-14. Except in Karnataka and Uttar Pradesh, all other States report a surplus of seeds. In Andhra Pradesh, the big producer of seeds, this surplus is 4 lakh quintals, with availability being 32.43 lakhs against a requirement of 28.33 lakh quintals.

Crop-wise, deficits have been reported in the case of 9 crops such as Maize, Banyard Millet, Niger seeds, Arhar, Cow Pea, Moth bean, Jute, Dhaincha and Guar. Large deficit can be seen in Maize seeds. There is balance too in 5 crops – availability and requirement match exactly in the case of crops such as Italian Millet, Rajma, peas, Bajra Napier and rice bean. However, it should be big relief to know that in the case of major crops such paddy, cotton and ground nuts, more seeds are available than the requirement. One needs to see how the situation pans out, when farmer starts buying seeds to start sowing in kharif 2013.

However, past record shows that private seed companies, with the connivance of few government officials, official apathy and neglect, would continue to play tricks with seed markets, distorting demand and supply.

In AP, as per official information, in 2010-11, the area under cotton crop was 18 lakh acre and about 80 lakh packets (of 450 gm) were used by farmers. The expected area under cotton crop in 2011-12 was about 20 lakh acres and the requirement of cotton seed would be around 90 lakh packets of 450 gm. Even if one takes, 4 packets per acre, there should be surplus of 10 lakh packets in AP state alone. There should have been sufficient packets, as per their own estimates, given before the announcement of increase in seed packet market prices. However, it was free for all, with farmers losing out ultimately.

Seed prices were increased by the governments, with no independent verification of the information proffered by the seed companies about rising seed production costs. There have been reports in the media of corruption involving some higher political and administrative functionaries.

In Andhra Pradesh, the problem of cotton seeds as surmised by government officials in 2012-13 kharif was that farmers wanted only a particular variety, of a particular company, despite the availability of 'good quality' seeds from other companies. However, with 1,128 BT cotton hybrids introduced in the markets (from 2002-2012), farmers have to make a choice. This 'choice' has been distorted by marketing tricks played by seed companies. Advertisements with high promises, attractive brochures and packets, promotional campaigns by high profile individuals, collection of advance payments in crores of rupees, etc., extend their pernicious influence on the farmer's choices.

Seed Testing Laboratories, seed certification standards, seed inspectors and seed germination reports of this system have not helped the farmers. Independent, informative and accessible information system is not available to the farmers in the form and language they can understand about the quality, quantity and accessibility of these 1,128 BT cotton hybrids and other crop seeds as well. Agricultural extension system does not help either. Farmers are left to the network of 'gullible' officials, seed traders, commission agents and seed companies.

**Pricing**

Pricing of seeds is a major area of concern, with little regulation of the same from the government. Seed companies demand that price for Bollgard-I and Bollgard-II (Bt cotton seeds) should be increased. Accordingly across India, BT cotton hybrid prices were increased.

However, seed companies have been saying primarily the

government has no say or role in fixing the BT cotton seed price. They want freedom to fix and sell the seeds, and would not undertake any responsibility for the quality of seeds.

Interestingly, Mr. Sharad Pawar, Union Minister of Agriculture and Food Processing Industries, had asked the AP State to deregulate the cottonseed pricing. "A competitive and vibrant seed industry would be able to serve the interests of farmers by ensuring the timely availability of cottonseeds at reasonable prices," Mr. Pawar observed in a letter to the AP Chief Minister, Mr. N. Kiran Kumar Reddy. "The area under Bt cottonseed cultivation has reportedly come down. This would adversely affect the availability of Bt cottonseeds in future. In the long term this would harm entire cotton economy," he cautioned.

"This trend can only be reversed if cottonseed farmers are paid substantially higher prices to encourage them to continue with production of Bt cottonseeds. This needs revisiting of policy that regulates cottonseed pricing," he said in the letter.

The same Union Minister for Agriculture did not bother to write a letter on the losses suffered by farmers, due to bad seeds, heavy rains and floods, every year. It is another matter, he did not even consider visiting them and giving them confidence.

Meanwhile, the cost of seeds for the farmers has been increasing. Quality is a major issue for farmers, as most seeds, which come in packets and branded, do not germinate, grow, develop leaves, flower or give proper yield. Many farmers, who invest on land preparation, water and electricity, labour, crop protection, land fertilization, etc., find that with low quality seeds, all their efforts go waste – down the drain. This leaves them poorer by so much of investment. Risks due to seeds are increasing, and their worries are multiplying. Other risks include market prices and natural disasters (sudden rains, hailstorms, extreme heat or cold conditions, floods, drought, water shortages, etc.).

It is important that prices of seeds are regulated by the government, on an annual basis. Private seed industry is supplying high-value, low volume seeds to the farmers, through local production and imports. Seed prices are being arbitrarily fixed, leading to a huge burden on the farmers. Today, the percentage of expenditure on seed in the overall cost of production ranges from 6 to 33%. Seed industry has been claiming success of their seeds/labeled products, as an argument to increase the seed prices. Thus, they brought performance of seeds as a causal factor for seed pricing. Hence, performance of their products needs to be discussed. It would be important to measure the performance against the current price.

Cost of production of seed has been the contentious issue. While seed farmers are crying hoarse about practices of the private seed industry, which denies them proper price for their sweat and efforts, seed industry so far has not responded with any transparent and acceptable mechanism of benefit sharing with the seed farmers. Seed farmers need an assured price and a mechanism that is supported by the government in ensuring proper returns for them.

Royalty or trait fee continues to be the major problem. One needs to study this aspect more deeply and extensively. International norms and practices in other countries need to be referred to. Trait fee is supposed to be based on the R & D investment and should not be more than 5-6 percent as per agreed norms. However, it would be absurd to link it with paying capacity of the farmers. As with every commercial product, cost of production continues to be the basis for arriving at the market price, and not the market price of the benefit accrued from the supplied raw inputs. Market price for the harvested crop cannot be the criteria for fixing the seed price. Even if by any chance this principle is applied, then the loss also needs to be linked.

Importantly, when BG I cotton seed is no longer performing as

per its original expectation, as admitted by the seed industry, why trait fee is being levied for the same? While the price for refuge crops is included in the cost of production given by the industry, in the field, one can see that there is no supply of the same. As a result, Rs.50 to 75 is being collected by the companies, without supplying the same.

**National Seed Policy**

National Seed Policy envisions encouragement of private seed sector as a solution. Governments, both central and State, have exempted seed companies from income tax, provide incentives and encourage them to spread their trade networks by including them in seed subsidy programmes. As a result, seed companies are growing in revenues, despite problems being faced by farmers. Between 2009-11, growth rate of revenues of major seed companies was remarkable, ranging from a low of 8 percent to a high of 75 percent. According to International Seed Federation, Indian seed market is valued at Rs.10,800 crores in 2011.

Despite negative experiences in seed sector, after the entry of private sector, especially proprietary seeds, government has failed to do a honest assessment of the situation and bring in relevant changes to help the farmers. There is no detailed discussion of the same in the Parliament. Even though government keeps emphasizing on competition, 'monopolisation' of Indian seed sector through proprietary seeds and licensing has defeated such purpose. Withdrawal of public sector and with lesser and lesser public seed varieties in the markets, private seed sector has been acting as syndicate in turning uncertainties and anxieties into profits.

Seed bill is pending in Parliament, merely because farmers have been asking for wider scope for regulation and decentralized regulatory system.

Seed statistics are as distorted, based on the objective of the

particular data, leaving a serious researcher aghast. For example, a serious research paper puts out total seed production as 280 lakh quintals in 2009-10. However, government assessment in kharif 2013 puts total seed availability as 154 lakh quintals. Does this mean there is a reduction in production? There are many such example, where the variation in quantities and information is very wide. If government policies are based on such unreliable statistical estimates, no doubt government leaders would continue to believe that the problem is with the farmers and not with their policies and procedures.

**Budget**

National government has spent Rs.292 crores on different schemes on seed in 2011-12. However, the allocation has decreased to Rs.217 crores in 2013-14. In 2012-13, there was allocation of Rs.316 crores, but it was revised down to a mere Rs.211 crores. In 2011-12 and in subsequent years, allocations for National Mission on Seeds are nil, indicating that government is reluctant to invest in seed production and infrastructure. In Andhra Pradesh, in 2011-11, expenditure on seeds was Rs.167 crores. Yet the allocation was decreased to Rs.161 crores in 2012-13. In 2013-14, it increased to Rs.192 crores. Despite this increase, there is negative change in direct seed subsidies, from an expenditure of Rs.150 crores in 2011-12 to an allocation of Rs.124 crores in 2013-14.

Government investments are decreasing in seed infrastructure, research and production, if not completely zero. Most of the funds are being directed to subsidies on seeds. However, farmers do not benefit from these subsidies, as these schemes are tied up with procurements, tenders, specific 'proprietary seeds' and corruption. Seeds supplied under these schemes are usually low quality, and/or highly priced.

**Conclusion**

A recent report by Centre for Food Safety and Save our Seeds,

Seed Giants Vs US farmers, 2013, says, “in the last few decades, the U.S. has led a radical shift toward commercialization, consolidation, and control of seed ownership. Three agrichemical firms—Monsanto, DuPont, and Syngenta—now control 53 percent of the global commercial seed market. The top ten seed firms, with a majority stake owned by U.S. corporations, account for 73 percent.  This shift has fundamentally changed farming in the U.S. Instead of continuing the historical tradition of farmers having full access to seeds that they have cultivated over centuries, agrichemical corporations now own the sine qua non of farming - indeed, the irreplaceable element of all food - seeds.”

Indian farming is also changing the same way, with active support of Indian government. There seems to be lot of distortion, fudging and deliberate misinformation being spread by the seed companies, primarily to increase the anxiety among farmers and mint profits out of such anxiety. Unfortunately, government seems to be a 'knowingly' silent spectator, if not a partner-in-arms. There is no independent agency, which can fix responsibilities, punish the guilty and correct this faulty system. No political leader, worth his salt, has cared to bring succor to the farmers. No 'conscientious' official has stood up to the machinations of the seed companies. Hard, toiling farmers are increasingly becoming victims of a powerful combine of politicians, traders and companies.

Fundamentally, the problem with seeds is not about lack of good seeds, but lack of access to good seeds because of a shared perspective between a few multinational seed companies and a few Indian decision makers.

★★★